# విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

మంగళవారం 16 సెప్టెంబరు 2025 8 పేజీలు


# ఆటో కార్మికులను ఆదుకోవాలి

**ప్రతి ఆటో కార్మికుడికి జీవన భృతి నెలకు రూ.5 వేలు ఇవ్వాలి**

**ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : దోనేపూడి శంకర్ డిమాండ్**

**విశాలాంధ్ర-విజయవాడ :** ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికై, ఉపాధి కరువైన ఆటోకార్మికులకు ప్రతి నెల రూ.5 వేలు జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 9 గంటలకు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఇంటి వద్ద ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు గూడేల జనార్ధన్ అధ్యక్షతన ధర్నా చేశారు. అనంతరం మంత్రికి యూనియన్ తరపున వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు దోనేపూడి శంకర్ రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది ఆటో కార్మికులకు జీవితాలకు నేడు సరైన ఉపాధి కరువై భవిష్యత్ అగమ్యగోచరంగా మారిన తరుణంలో ముఖ్య మంత్రి ఇటీవల కాలంలో ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు రానున్న దసరా నాటికి ఇస్తామని ప్రకటించిందని, ఆటో కార్మిక సంఘంగా స్వాగతిస్తునాని అన్నారు. ఈ సందర్భంలో ఆగస్టు 15 తేదీన కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "స్త్రీ-శక్తి" పథకానికి సగటు పౌరులుగా స్వాగతిస్తునప్పటికీ ఈ పథకం అమలుతో ఇప్పటికే అడ్డు అదుపు లేకుండా పెరిగి పోతున్న ఇంధన ధరలు మిగతా 2 లో ...

## విజయవాడలో నేడు నిరసన ధర్నా

**సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్**

**విశాలాంధ్ర -విజయవాడ:** నగర ప్రజలకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ఆపరేషన్ బుడమేరును అమలు చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పత్రిక ప్రకటన ఆయన విడుదల చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పార్టీ ఎన్టీఆర్ కృష్ణా ఏలూరు జిల్లాల కార్యవర్గం ఆధ్వర్యంలో నగరంలోని ధర్నా చౌక్ వద్ద ఈ నెల 16 తేదీన మంగళవారం పెద్ద ఎత్తున నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నిరసనకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటున్నారని అన్నారు. ఈ మూడు జిల్లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## డీజీపీని కలిసిన గుంటూరు జిల్లా ఎస్పీ

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** గుంటూరు జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వకుల్ జిందాల్ సోమవారం రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలసి, మొక్కను అందించారు. వకుల్ జిందాల్‌కు మిగతా 2 లో ...

## కృష్ణా జిల్లా ఎస్పీగా విద్యాసాగర్ నాయుడు బాధ్యతలు

**విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం :** మచిలీపట్నంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో కృష్ణా జిల్లా ఎస్పీగా వి.విద్యాసాగర్‌నాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి విచ్చేసిన ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడుకు సిబ్బంది గౌరవ వందనం సమర్పించగా వేద మంత్రాల నడుమ జిల్లా ఎస్పీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో కృష్ణాజిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన ఆర్.గంగాధరరావు స్థానంలో అన్నమయ్య జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై మిగతా 2 లో ...

## అర్హులైన ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌కు 'వాహనమిత్ర' అమలు చేయాలి

**గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ & వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, అరుణ్‌కుమార్**

**విశాలాంధ్ర-గుంటూరు సిటీ:** అర్హులైన ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ కు వాహన మిత్ర పథకం అమలు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగా శ్రీనివాసరావు, ఆకిటి అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక బి.ఆర్ స్టేడియం స్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగ శ్రీనివాసరావు, ఆకిటి అరుణ్ కుమార్‌లు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు భారంగా మారిన జీవో నెంబర్ 21, 31 లను రద్దు చేయాలని, చనిపోయిన ఆటో కార్మికునికి ప్రమాద భీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి తేడా లేకుండా పోతుందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో కార్మికులకు ఆయా మార్గాలను సర్వే చేసి అర్హులైన ప్రతి ఆటో కార్మికునికి ప్రతి నెల రూ.5వేలు ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వాహన మిత్ర పథకం అమలులో ఎటువంటి ఆంక్షలు పెట్టకుండ ఆటో తొలుతున్న ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌తో పాటు యజమానికి మిగతా 2 లో ...

రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాల్లో ఐసెట్ అడ్మిషన్ల తేదీలను వెంటనే పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ డిమాండ్ చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి యశ్వంత్, విశ్వవిద్యాలయ అధ్యక్షుడు పాలెం నాసరయ్యలు మాట్లాడుతూ సెలవు దినాలను పట్టించుకోకుండా అలాట్‌మెంట్ ఆర్డర్లు విడుదల చేసి, విద్యార్థులను అయోమయంలోకి నెట్టేసారని తీవ్రంగా విమర్శించారు. 8 లో ...

## పూర్తి నియంత్రణలోనే డయేరియా

- ప్రభుత్వ చర్యలకు ప్రజా చైతన్యం తోడవడంతో కేసులు తగ్గుముఖం
- చివరి కేసూ కోలుకొని ఇంటికెళ్లే వరకు జాగ్రత్త వహించాలి
- ముందు కూడా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి
- ఇంటింటి సర్వే, అవగాహన కల్పన, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- అధికారులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ దిశానిర్దేశం

**విశాలాంధ్ర-విజయవాడ :** విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా పూర్తి నియంత్రణలో ఉందని.. ప్రభుత్వ చర్యలకు ప్రజాచైతన్యం తోడవడంతో కేసులు బాగా తగ్గుముఖంపట్టాయని, అయినా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి ముందు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. సమన్వయ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 275 మంది చికిత్స తీసుకొని డిశ్చార్జ్ కాగా.. 42 మంది చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. కేర్ అండ్ షేర్ స్కూల్లో వైద్య శిబిరంతో పాటు న్యూ జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య బృందాల చికిత్స, ఇంటింటినీ మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

## ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఒక పక్క ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల దోపిడి ఒక పక్క ఇవి చాలవు అన్నట్టు అపరాధ రుసుంల పేరుతో ప్రభుత్వ అధికారుల వేధింపులు మరో పక్క ఇలాంటి ప్రతికూల పరిస్థితులలో ఆటో కార్మికులు జీవనోపాధి కరువై ఆత్మహత్యలే శరణ్యం అనే పరిస్థితులు దాపురించాయని అన్నారు. ఇటువంటి తరుణంలో వారిని ఆదుకొని వారికి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది అని స్పష్టం చేసారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి యూని యన్ నాయకులు వివరించారు. ఈ సందర్భముగా మంత్రి ఆటో కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ అధికారులతోను సీఎంతో చర్చించి ఆటో కార్మికులకు తగు న్యాయం చేస్తాము అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు లంకా గోవిందరాజులు, యూనియన్ నాయకులు పి.సుబ్రహ్మణ్యం, కె. వెంకట్చి, కమ్మిన శ్రీను, పచ్చల శ్రీను, ప్రసాద్, చారి, మూర్తి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## డీజీపీని కలిసిన గుంటూరు జిల్లా ఎస్పీ

శుభాకాం క్షలు తెలిపిన డీజీపీ మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణలో ఎల్లప్పుడూ విజయాలు సాధించి ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. గుంటూరు జిల్లా రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన, సవాళ్లతో కూడిన జిల్లాల్లో ఒకటని, ఇక్కడి భౌగోళిక పరిస్థితులు, జనాభా విస్తీర్ణం, ఇతర సవాళ్లను దృష్టిలో పెట్టుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీకి డీజీపీ సూచించారు. గుంటూరు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడానికి, అలాగే సాంకేతికత ఆధారిత పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించడానికి అన్ని స్థాయిలలో కృషి చేయాలని అన్నారు.

## కృష్ణా జిల్లా ఎస్పీగా విద్యాసాగర్ నాయుడు బాధ్యతలు

నూతన ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు విచ్చేసారు. అనంతరం ఎస్పీని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి.నాయుడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్యన్నారాయణ, డీఎస్పీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

2016లో ఇండియన్ పోలీస్ సర్వీస్ ద్వారా పోలీస్ శాఖలోకి అడుగు పెట్టిన వి. విద్యాసాగర్ నాయుడు అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చింతపల్లి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, లా అండ్ ఆర్డర్ విశాఖపట్నం, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (గ్రేహౌండ్స్) సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అన్నమయ్య జిల్లాలో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వం తలపెట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా నేడు కృష్ణాజిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎంతో ప్రఖ్యాత చరిత్ర కలిగిన కృష్ణాజిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రజా సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుసరించి విధి నిర్వహణ కనబరుస్తానని, మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సిబ్బందిని ఎల్లవేళలా అప్రమత్తం చేస్తూ ,24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. చిన్నారులకు, వృద్ధులకు, మహిళలకు రక్షణ కల్పిస్తామని, ఎంతో మందికి దక్కని అదృష్టాన్ని దేవుడు పోలీస్ ఉద్యోగం ద్వారా అందించాడని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అహర్నిశలు ప్రజా సేవలో నిమగ్నమవుతానని,ప్రజా సమస్యలు పరిరక్షించడంలో కృష్ణాజిల్లా ముందుంటుందని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో స్థాయి బేధం లేకుండా సిబ్బందితో పాటు ముందుంటానని, ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఆదిశగా కార్యాచరణ ఉంటుందని అన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌కు

# 'వాహనమిత్ర' అమలు చేయాలి

కూడా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాబోయే రోజుల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, ఆటో సంఘం నగర అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్, సహాయ కార్యదర్శి మహమ్మద్ బాబర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఆటో యూనియన్ నాయకులు, రజాక్, గఫారి, కొండ, జయరాం, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి నియంత్రణలోనే డయేరియా

జల్లెడపట్టడం, అవగాహన కల్పించడం, ఎవరికైనా రోగ లక్షణాలు ఉంటే సత్వరం స్పందించి సేవలు అందించడం, ఇంటింటికీ మినరల్ వాటర్ సరఫరా, ప్రచార సామగ్రితో అవగాహన కల్పన, విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమాలు, హైజీన్ కిట్ల పంపిణీ.. ఇలా ప్రభుత్వ చర్యలకు తోడు ప్రజా చైతన్యం తోడవడంతో సత్ఫలితాలు వచ్చాయన్నారు. ప్రతి వార్డు సచివాలయానికీ ఒక జిల్లాస్థాయి అధికారికి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించారని ఈ ప్రత్యేక అధికారి నేతృత్వంలోని బృందాలు చివరి కేసూ కోలుకొని ఇంటికెళ్లే వరకు జాగ్రత్తగా ఉండాలని, నిరంతర పర్యవేక్షణతో ముందు కూడా డయేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రేసింగ్ - ట్రీట్‌మెంట్ విషయంలో మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

**64 డివిజన్లకూ ప్రత్యేక అధికారులు:**

న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కేసుల నేపథ్యంలో ముందుజాగ్రత్తగా అర్బన్ పరిధిలో ఎక్కడా డయేరియా ప్రబలకుండా చర్యలకు ఆదేశించామని.. ఇప్పటికే డ్రెయిన్లలో పూడిక తీయడం, యాంటీ లార్వాల్ ఆపరేషన్స్ (ఏఎల్‌వో) నిర్వహించడం, పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతం చేయడం, క్లోరినేషన్ డ్రైవ్, ప్రజలకు అవగాహన కల్పించడం, తాగునీటి పరీక్షల నిర్వహణ తదితరాలపై వీఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా దృష్టిపెట్టినట్లు తెలిపారు. ఇదేవిధంగా జిల్లా అధికారుల నేతృత్వంలో 64 డివిజన్లకూ ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

# ప్రత్యామ్నాయ పంటలతో ఆదాయం సాధించాలి

### కృష్ణాజిల్లా ఉద్యానవన శాఖ అధికారిణి జె.జ్యోతి

**విశాలాంధ్ర-చల్లపల్లి :** రైతులు తలచుకుంటే వరి పొలంలో కూడా వరితోపాటు ఇతర పంటలు వేసి ఆదాయాలు సాధించగలరని కృష్ణాజిల్లా ఉద్యానవన శాఖ అధికారిణి జె.జ్యోతి అన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో రైతు నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ఎన్నారై మండవ శేషగిరిరావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉద్యానవన అధికారిణి జ్యోతి మాట్లాడుతూ, రైతులు మనసుపెట్టి వ్యవసాయం చేస్తే అద్భుతాలు సృష్టిస్తారనీ, రైతుకు మించిన శాస్త్రవేత్త లేరనీ, వారికి అధికారుల అవసరం కూడా ఉండదన్నారు. వరిపొలంలో ప్రత్యామ్నాయ పం టలు సాగుచేసి ఎందరో రైతులు విజయాలు సాధించారని వివరించారు. వరిపంట సాగుచేసే రైతులు గట్లను పెద్దవిగా చేసుకుని వాటిపై కొబ్బరి, కంది, మునగ, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయలు వంటివి సాగుచేయటం వల్ల అధిక లాభాలు సాధించే అవకాశం ఉందని వివరించారు. వక్కమొక్కలు నాటి దానిలో అంతరపంటగా కోకో, మిరియాలు పండించటం ద్వారా ఒకే సమయంలో పలురకాల దిగుబడులతో లాభాలు సాధించవచ్చని అన్నారు. ఉండవల్లి ఆగ్రోఫామ్ జీఎం బి. హరికృష్ణ మాట్లాడుతూ, వరిసాగు చేసుకుంటూనే పామాయిల్ సాగు కూడా వేసుకోవచ్చన్నారు. పూర్తిస్థాయిలో రైతులు పామాయిలను ప్రధాన పంటగా సాగుచేసేట్లు తే బ్లాక్ ఫౌండేషన్ (ఒక ఏరియాలో ఉన్న అందరు రైతులు కలిసి) పద్ధతిలో సాగుచేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. పామాయిల్ సాగుచేపట్టే రైతులు తప్పనిసరిగా పొలంలో నీరు నిలవకుం డా సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేసుకుంటే మంచి దిగుబడులు ఉంటాయని అన్నారు. విశ్రాంత ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ మాట్లాడుతూ, ఇతర దేశాలలో ఉంటూ కూడా మన ప్రాం తాన్ని వృద్ధిలోకి తీసుకురావాలనే తపనతో ఎన్నారై మండవ శేషగిరిరావు చేస్తున్న కృషి ప్రశం సనీయమన్నారు. మరికొంత మందితో కలిసి ఫ్లోరిడాలో కూడా వ్యవసాయం చేస్తున్న ఘనత శేషగిరిరావుకే దక్కుతుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకమైన పాలసీవిధానాన్ని తీసుకువచ్చినప్పుడే ఏ పం టలు పండించటానికైనా, మార్కెటింగ్ చేయటానికైనా అవకాశాలు మెండుగా ఉంటాయనీ, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలన్నారు. సదస్సులో రైతు నాయకులు గుత్తికొండ రామూ, మిక్కిలినేని మధు, దోనేపూడి గోపీకృష్ణ, తదితర రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శలు

**విశాలాంధ్ర-చల్లపల్లి:** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం చల్లపల్లిలో పలువురిని పరామర్శించారు. గణేష్ ప్రెస్ అధినేత వక్కలగడ్డ రాధాకృష్ణ మృతిచెందగా, కుటుం బ సభ్యులను పరామర్శించారు. ఎస్టీ కాలనీలో ఆర్టీసీ ఉద్యోగి ఉప్పల మురళి గుండెపోటుతో కన్నుమూయగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలాజీ అపార్ట్‌మెంట్ లో మాతృవియోగం పొందిన టీడీపీ నేత సూరపనేని రవిని పరామర్శించారు. బొండలపాటి సుబ్రహ్మణ్యం మృతిచెందగా భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పం చ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ ఛైర్పర్సన్ బొందలపాటి వీరబాబు, నేతలు షేక్ నబీఖోరి, రావి చిట్టి, షేక్ సిలార్, రావి రాజు, కోట సత్యనారాయణ, ఉరిమి మణికాంత్, అల్లంశెట్టి మాణిక్యాలరావు, అడపా రవి తదితరులున్నారు.

# గాంధీకొండ పునరుద్ధరణ

### కాంతిమంతం కానున్న జాతీయ స్మారకం

**విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్):** విజయవాడ పాతబస్తీలోని గాంధీ కొండను మళ్లీ పూర్వ వైభవంతో నిలబెట్టే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని మాజీ మేయర్, కమిటీ సభ్యులు డాక్టర్ జంధ్యాల శంకర్ సోమవారం పేర్కొన్నారు. 1969లో మహాత్మా గాంధీ శతజయంతి సందర్భంగా నిర్మించిన 56 అడుగుల ఎత్తైన గాంధీ స్థూపంతో ప్రారంభమైన ఈ కొండ పైన ప్లానెటోరియం, లైబ్రరీ, మ్యూజియం, పిల్లల ట్రైన్, ఉద్యానవనం, గాంధేయ నమూనా గృహాలు వంటి ఆకర్షణలతో, గాంధీ సందేశముతో కూడిన "కాంతి ధ్వని" కార్యక్రమము వేలాది సందర్శకులను రంజింప చేస్తున్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో అనేక కారణముల వల్ల సదుపాయాలు జీర్ణావస్థకు చేరగా, డాక్టర్ గాంధీ పి.సి. కాజా ఐపీఎస్ అధ్యక్షత ఏర్పడిన కొత్త కార్యనిర్వాహక కమిటీ ఎలివేటర్ ఏర్పాటు, పిల్లల రైలు పునరుద్ధరణ, రహదారి విస్తరణ, వారసత్వ ప్రదేశాల అభివృద్ధి వంటి పథకాలను చేపట్టారని చెప్పారు.ప్రజలందరూ గాంధీ కొండ పునరుద్ధరణలో భాగస్వాములై, ఈ జాతీయ స్మారకాన్ని శాంతి, గాంధేయ తత్త్వాల ప్రతీకగా నిలబెట్టాలని కమిటీ విజ్ఞప్తి చేస్తోందని అన్నారు. అందుచేత, మహాత్ముడు ఆంధ్రలో పర్యటించిన జ్ఞాపకాలతో సంబంధమున్న ఫోటోలు, వస్తువులు, కథనాలు లేదా ఇతర సమాచారం ఉన్నవారు వాటిని గాంధీ కొండ బీవీ మ్యూజియంలో భద్రపరచడానికి అందించాలని గాంధీ ఫౌండేషన్ కమిటీ కోరుతోందని తెలిపారు.అందిన వివరాలు పుస్తకరూపంలోను ఎగ్జిబిషన్ లో ప్రదర్శింప బడుతాయని, ఒరిజినల్స్ ను తిరిగి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వివరములకు ఫోన్ సెంటర్లు 94406 25778, 89855 50485 సంప్రదించాలని కోరారు. జంధ్యాల శంకర్ విజ్ఞప్తి చేశారు.

# మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి : జేసీ ఇలక్కియ

**విశాలాంధ్ర-విజయవాడ :** మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే సమాజం బాగుంటుందని.. మహిళల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. వైద్య ఆరోగ్య శాఖతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ పుట్టిన ఆడ శిశువు మొదలు మహిళలందరి ఆరోగ్య సంరక్షణకు కేంద్రం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తుందన్నారు ఈనెల 17వ తేదీన గౌరవ దేశ ప్రధాని ఈ పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోనూ అదే రోజు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా క్యాంపులు ద్వారా మహిళల ఆరోగ్య సమస్యలపై స్పెషలిస్ట్ డాక్టర్లతో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

# ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో నగరపాలక సంస్థ ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. స్థానిక జక్కంపూడి కాలనీలో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నగరపాలక సంస్థ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి రక్షిత మంచి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, జక్కంపూడి కాలనీలో డ్రెయినేజీల వద్ద వాటర్ లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్లపై అనధికార కట్టడాలను తొలగించాలని, దోమలు పెరగకుండా యాంటీ లార్వే ఆపరేషన్లు నిర్వహించి ప్రతిరోజు ఫాగింగ్, యంఎల్ ఆయిల్ స్ప్రే, డ్రోన్ ద్వారా ఖాళీ స్థలాల్లో, డ్రెయిన్లలో, కాలువల్లో యంఎల్ ఆయిల్ స్ప్రే చేయాలన్నారు. జక్కంపూడి కాలనీలోని బోర్లన్ని నీటి పరీక్షల నిర్వహించాలని, ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లన్నిటిలోనూ త్రాగునీటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి : డీఆర్ఓ కే. చంద్రశేఖర రావు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : అర్జీలను పరిష్కరించే అధికారి అర్జీదారు నితో మాట్లాడి అతని సమస్య పరిష్కారం అయింది లేనిది విచారించడం వలన అర్జీదారునికి సంతృప్తి కలుగుతుందని డీఆర్ఓ కే చంద్రశేఖరరావు అన్నారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం డీఆర్ఓ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఐగాట్ కర్మయోగా అన్లైన్ శిక్షణ తరగతుల్లో కృష్ణాజిల్లా నాలుగో స్థానంలో ఉందని, అందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. ప్రతి నెల 3 కోర్సులు పెరుగుతూ ఉంటాయని అశ్రద్ధ చేయక వాటికి ఎప్పటకప్పుడు పూర్తి చేయాలన్నారు. కెఆర్ఆర్‌సిఎస్‌డిసి శ్రీదేవి మాట్లాడుతూ పంచాయితీరాజ్ శాఖలో ఎక్కువగా అర్జీలు అపరిష్కృతంగా ఉన్నాయని, సత్వరమే వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి హరిహరనాథ్, డీఎస్ఓ మోహన్ బాబు, డీఎంహెచ్ఓ ఏ. వెంకట్రావు, రహదారులు, భవనాల ఈఈ లోకేష్, డీఈఓ పిజె. రామారావు, డిపిఓ అరుణ, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానందం, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీకిషోర్, డిసిఓ చంద్రశేఖర్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, సర్వే భూమి రికార్డుల ఏడి జోషిల, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాజు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పశువుల సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే కుమార్ రాజా

విశాలాంధ్ర-పెదపారుపూడి : పశువుల సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని పశువులను ఆరోగ్యకరంగా చూసుకోవాల్సిన అవసరం, బాధ్యత గ్రామీణ ప్రాంత పశుపోషకులపై ఎంతైనా ఉన్నదని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని యలమర్రు పశు వైద్యశాలలో టిడిపి సీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబుల ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటి వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పశువులకు కావలసిన పచ్చమేత విత్తనాలను పశుపోషకులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. పశువులకే కాకుండా గొర్రెలకు, కోళ్లకు ఎటువంటి వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు పశు వైద్య సిబ్బంది తీసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఏ హెచ్ ఓ సిహెచ్ నరసింహులు, డిడి శ్రీనివాస్, ఏడి జీవీ నరసింహారావు, పశు వైద్యులు డాక్టర్ జయంత్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ వనిత, డాక్టర్ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ కమిటీ

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతానని ఇచ్చిన మాట మేరకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు కార్యచరణ చేపట్టారు. బాబులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలంలోని చెరువులు వాగులు ప్రభుత్వ భూములు అక్రమాణాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఇప్పటికే ఆఖరిమానాల పాలైన వాటిని విడగొట్టాలని కృష్ణాజిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై కలెక్టర్ డీకే బాలాజీ ప్రభుత్వ భూములపై పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు ప్రత్యేక కమిటీని, జిల్లా పంచాయతీ అధికారి గుడివాడ ఆర్డిఓ 3 మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఆయా గ్రామ కార్యదర్శులు వీఆర్వోలతో ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి మూడు మండలాల్లో నీ ప్రభుత్వ భూములు పై విచారణ చేసి ఆక్రమాలకు పాలైన ప్రభుత్వ భూములు వివరణతో నివేదిక సమర్పించాలని కృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కమిటిని ఏర్పాటు చేశారు. కమిటీ నియమించడంపై పలువురు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ధన్యవాదాలు తెలిపారు.

## జీతాలు చెల్లించాలని ఆసుపత్రి సిబ్బంది నిరసన

విశాలాంధ్ర - గుడివాడ : గుడివాడలో ప్రభుత్వ ఏరియా అసుపత్రిలో ఏఐటియూసి ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్స్ ఆందోళన చెప్పాటారు. సోమవారం స్థానిక ఏరియా అసుప్రతిలో ఏఐటియుసి నాయకులు గూడపాటి ప్రకాష్‌బాబు, సిహెచ్ సత్యనారాయణలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మెడికల్ డిపార్ట్మెంట్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కి కాంట్రాక్టర్ గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల పీఎఫ్, ఈఎస్ఐలు సరైన టైంలో కట్టక శానిటేషన్ వర్కర్స్ ఇబ్బంది పడుతున్నరన్నారు. కాంట్రాక్టర్‌కి వ్యతిరేకంగా గతంలోని అధికారులు, దుష్టికి తసుకువెళ్ళాడం జరిగిందన్నారు. హాస్పటల్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు లేక తినడానికి లేక వర్కర్స్ ఇబ్బంది పడుతూ డ్యూటీలు చేస్తున్నారు. పుండు మీద కారం చల్లిన విధంగా కార్మికులపై ఇద్దరు సూపర్వైజర్స్‌ని ఇన్చార్జులుగా పెట్టి మరీంత ఇబ్బంది పెడుతునరన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, రాణి, నాగఆంజనేయులు, వర్కర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన జెసిఐ గుడివాడ ప్రిజమ్ - 110 జెసిఐ వారోత్సవాలు

విశాలాంధ్ర - గుడివాడ : ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9- 15 తేదిలలో దేశవ్యాప్తంగా నిర్వహించే జెసిఐ వారోత్సవాలు ఈసారి ప్రిజమ్ - 110గా ప్రత్యేకతను సంతరించుకుంది. సోమవారం స్థానిక జెసిఐ భవనంలో వారాంతర కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి, గ్రేట్ డే సెలబ్రేషన్స్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చార్టర్డ్ అకౌంటెంట్ మండవ మనోజ్‌ను అవుట్‌స్టాండింగ్ యంగ్ పర్సన్‌గా, జెసి సలీమ్ (ఎంట్రప్రెన్యూర్)ను కమలపత్ర అవార్డులతో సత్కరించారు. అదనంగా పోలీస్ విభాగంలో నాగ విశ్వనాథ్, కానిస్టేబుల్ రామును, ఫైర్ విభాగంలో యోగానంద్, పోస్టల్ విభాగంలో శిరీషలను సైలెంట్ స్టార్స్కు అవార్డులను అందజేశారు. క్రీడా కార్యక్రమంలో బ్యాడ్మింటన్ రన్నరప్‌గా నిలిచిన ఉద్వేగ్‌కు పురస్కారం అందజేశారు. వారం రోజులు ప్రత్యేకంగా కార్యక్రమలు నిర్వహించిన కో-ఆర్డినేటర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోన్ డైరెక్టర్ జెసి లక్కం రవీంద్ర, లక్కీ జైన్, వంశీ, మోనిష్, అన్నం చిన్నవీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## యాంత్రీకరణ వ్యవసాయంతో ప్రయోజనాలు : ఎమ్మెల్యే వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : సాంకేతికంగా అందుబాటులోకి వచ్చిన యాంత్రికరణ వ్యవసాయంతో రైతాంగానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడివాడ రూరల్ మండలం తట్టివర్రు గ్రామంలో డ్రోన్ సహాయంతో వరి పొలంలో రసాయనాల పిచికారి విధానాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. డ్రోన్ ద్వారా ఫెస్టిసైడ్స్ స్ప్రే చేయడంతో కలిగే పరయోజనాలను వ్యవసాయ శాఖ అధికారులు రైతాంగానికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద, రైతాంగ వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం డ్రోన్ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఐదుగురు రైతులు గ్రూప్‌గా కలిసి వస్తే 10 లక్షల విలువ ఉండే డ్రోన్ 8 లక్షల సబ్సిడీతో ప్రభుత్వమే అందిస్తుందన్నారు. డ్రోన్ ద్వారా కేవలం ఆరు నిమిషాల వ్యవధిలో ఒక ఎకరా మొత్తం రసాయలను స్ప్రే చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ॅర్పంచ్ నిర్మలకుమారి, వ్యవసాయ శాఖ అధికారులు ఎస్ కవిత, అనంతలక్ష్మి, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు గొర్రెపత్తి శ్రీనివాసరావు, కర్రే వెంకటగిరి, సాంబయ్య, వంశీకృష్ణ, సురపనేని చిన్నబాబు, జనార్ధన్‌రావు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-తాడేపల్లి: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవటం వలన ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చునని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పనిసరి అని తద్వారా సపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని కెఎల్ యూనివర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. జాతీయ పోషకాహార వారోత్సవాలలో భాగంగా సోమవారం తాడేపల్లి మండలంలోని మెల్లంపూడి గ్రామంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏఐ, డీఎస్ విభాగం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పోషకాహారం తీసుకోవడం వలన కలిగే లాభాలు గురించి వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కాయకూరలు, పండ్లు, పల్లీలు, నువ్వుల చిక్కీలు, పాలు, రాగిజావ, గుడ్లు, మాంసం, చేపలు తదితర పోషకాహారాన్ని తీసుకోవడం వలన రక్తహీనత సమస్య నుంచి బయటపడవచ్చునని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి వివరించారు. ప్రస్తుతం వస్తున్న వైరస్లు సీజనల్ వ్యాధులను తట్టుకోవాలంటే రోగనిరోధక శక్తి పెంచుకోవాలని, పోషకాహారంతోనే రోగనిరోధక శక్తిని పొందవచ్చునని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. జోనితిన్ సూచించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, వాలంటీర్లను యూనివర్శిటీ వీసీ జి.పార్ధసారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, స్టూడెంట్ అఫైర్స్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్, ఏఐ,డీఎస్ విభాగాధిపతి డాక్టర్ విఎస్ వి.ప్రభాకర్ తదితరులు అభినందించారు.

# ప్రతిరోజు తప్పకుండా పరీక్షలు చేయండి

## ఆక్రమణలను తొలగించండి
### కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : తెంటూ గౌరయ్య వీధిలో పబ్లిక్ టాక్ వద్ద స్వయంగా రేసిడ్యువల్ క్లోరిన్ టెస్ట్ నిర్వహించటంతో పాటు ప్రజల ఇంటి వద్దే ప్రతిరోజు తాగునీటి పరీక్షలు క్రమ తప్పకుండా నిర్వహించాలని, మురుగునీరు పారుదలకు అడ్డం ఉన్న డ్రెయిన్ ఇంక్రోచ్మెంట్ తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ స్థానిక లబ్బీపేట, టిక్కిల్ రోడ్డు, క్రీస్తు రాజపురం, రమేష్ హాస్పిటల్ రోడ్డు, లోయోల కాలేజ్ రోడ్డు, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డు, కేజే గుప్తా కాలనీ రోడ్డు, ఐదవ నెంబర్ రూటు, కనుమూరి దేవానందం రోడ్డు, బాడవపేట, జమ్మి చెట్టు సెంటర్, మధుచౌక్ ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని డ్రెయిన్లలో మురుగు నీటి పారుదలకు ఎలాంటి అంతరాయం లేకుండా, దానికి అడ్డొచ్చిన అనధికార కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. నిత్యం పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరుపుతూ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మరోవైపు యాంటీ లార్వే ఆపరేషన్లు జరుపుతూ ఉండాలని దోమలు పెరగ కుండా ఎక్కడికక్కడ వాటిని నిర్మూలించేందుకు డ్రోన్లతో స్ప్రే చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

విశాలాంధ్ర మచిలీపట్నం టౌన్ : మున్సిపల్ కార్మికులకు కాంట్రాక్టర్ నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వక, పీఎఫ్లు, ఈఎస్ఐలు సరైన సమయంలో ఇవ్వక కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని, వెంటనే కార్మికులకు వేతనాలు ఇవ్వాలని మునిసిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం సర్వజన ఆసుపత్రి ఎదుట ఏఐటీయూసీ కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా మెడికల్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న మునిసిపల్ కార్మికులకు కాంట్రాక్టర్ నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వక ఇబ్బంది పెడుతున్నాడని, తక్షణమే కార్మికులకు రావాల్సిన జీతాలు, పీఎఫ్లు, ఈఎస్ఐలు సరైన సమయంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్‌కు సమస్యలను వివరించి, వినతిపత్రం ఇచ్చామని, తక్షణమే ఆ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా నాయకులు లింగం ఫిలిప్, మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి ఒంటిపులి లక్ష్మణరావు, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఫణి జోసెఫ్, జి.లక్ష్మి, పి.దుర్గ, ధనలక్ష్మి, మోహన్, అంబేద్కర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వా రంగాన్ని ఆదుకోండి

విశాలాంధ్ర-కృత్తివెన్ను : కష్టాల్లో ఉన్న ఆక్వారంగాన్ని ఆదుకోవాలని కోరుతూ కృష్ణా జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తాసిల్దార్ కు వినతిపత్రం అందించారు. నేడు ఆక్వారంగం పూర్తిగా కష్టాల్లో ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఒకపక్క కరెంటు సమస్య, మరోపక్క గిట్టుబాధరు లేకపోవడం, మార్కెటింగ్ సరిగ్గా లేకపోవడంతో ఆక్వా రైతులు అప్పుల పాలవుతున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆక్వారంగాన్ని కూడా వ్యవసాయ రంగా గుర్తించి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పులగం సుబ్రహ్మణ్యం, ప్రత్తిపాడు రామాంజనేయులు, పుప్పాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణే కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తూ స్వచ్ఛరోగ్య సమాజాన్ని నిర్మిస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడన నియోజకవర్గం 4 మండలాలలోని గ్రామాలలో అనారోగ్యాల బారినపడిన 78 మంది నిరుపేదలకు సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.46 లక్షల 66 వేల 835 చెక్కులను సోమవారం మండల పరిదిలోని నాగేశ్వరరావుపేట ఎమ్మెల్యే స్వగృహం వద్ద కాగిత కృష్ణప్రసాద్ పంపిణి చేశారు. కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ, పేదలకు వైద్య సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని అన్నారు.

## పల్లెల్లోనే నిజమైన క్రీడా ప్రతిభ : సర్పంచ్ సౌజన్య

విశాలాంధ్ర-గన్నవరం : పల్లెల్లోనే నిజమైన క్రీడా ప్రతిభ దాగి ఉన్నదని శిక్షకులు వెలికి తీసి ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరావు అన్నారు.69వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 14 17 బాల బాలికల జిల్లా స్థాయి రాగబీ ఎంపికలు గన్నవరం బాలురు ఉన్నంత పాఠశాల క్రీడా ప్రంగణం లో సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా విచ్చేసిన సౌజన్య మాట్లాడుతూ ఈ సందర్భంగా జరిగిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ సునీల అధ్యక్షులు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకుకు పెద్ద పేట వేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగు నింపారని తెలిపారు. గన్నవరం పాఠశాల క్రీడా ప్రాగణం అభివృద్ధికి సహకారం అందించామని భవిష్యత్తులో కూడా తమ వంతు చేయూతనందిస్తామని సౌజన్యం తెలిపారు. నైపుణ్యత కలిగిన పేద క్రీడాకారుల కు ఆర్థిక పరిస్థితులు లేక క్రీడల్లో పాల్గొనలేని వారి కి దాతలు ముందుకు వచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె కోరారు.

## ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి
### ఏ.పి.టి.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు డిమాండ్

విశాలాంధ్ర, కూచిపూడి : ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని, పాఠశాలలో గడిపే సమయమంతా విద్యార్థుల బోధనకే వినియోగించే విధంగా ఉపాధ్యాయులకు స్వేచ్ఛనివ్వాలంటూ ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.వి. రామారావు డిమాండ్ చేశారు. ఏ.పి.టి.ఎఫ్. ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన వారం కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజైన సోమవారం తహశల్దార్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించి తాసిల్దార్ కే మస్తాన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నాలుగు డీ.ఏలను తక్షణమే విడుదల చేయాలని, మెమో నెంబర్ 57 ను అమలు చేయాలని, 12వ పి.ఆర్.సి కమిషన్ నియమించి అయ్యారు ప్రకటించాలని, ఈ హెచ్ ఎస్ పరిమితిని 25 లక్షల పెంచాలనే తదితర డిమాండ్లను వెల్లడించారు. మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని ఉపాధ్యాయులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని జె నాగరాజు, ఎన్.శివలక్ష్మి, బి మాణిక్యాలరావు, ఎల్ శ్రీనివాసరావు, జే కవిత, ఎం శ్రీధర్,ఎస్ ఎస్ నెహ్రూ, బి కిషోర్ బాబు, పి లక్ష్మేశ్వరరావు , వి ఎస్ కే లాల్, కే ఎన్ సోమేశ్వరమ్మ, కే ఏడుకొండలు,అమీన్,కే ఏడుకొండలు, టి నాంచారయ్య తదితరులు పాల్గొనగా వీరి పోరాటానికి ఎన్జీవో నాయకులు జె శ్యాం కుమార్, ఎం ఏ అలీ సంఘీభావం తెలిపారు

# కృత్తివెన్ను ఎంపీడీఓగా మొవ్వ ఏఓ

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి (ఏవో)గా విధులు నిర్వహిస్తున్న నూతుల పాటి శ్రీనివాసరావు పదోన్నతిపై కృత్తివెన్ను మండలపరిషత్ అభివృద్ధి అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన సోమవారం కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక, సీ.ఈ.వో.కన్నమనాయుడు చేతుల మీదుగా పదోన్నతి ఉత్తర్వులను అందుకొన్నారు.

## లంకపల్లి ఆర్బీకేలో సిబ్బంది కరువు

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండల పరిధిలోని లంకపల్లి రైతు సేవా కేంద్రంలో సిబ్బంది లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని రైతు సంఘం జిల్లా కమిటీ మెంబర్ కొల్లి వెంకట్రామయ్య ఆరోపించారు. రైతులు రైతు సేవా కేంద్రాలలో పంటను ఈ క్రాప్ చేయాలని సిబ్బంది లేకపోవడంతో రైతులు వచ్చి తిరిగి వెళుతున్నారని, అధికారులు నెలాఖరి తో ఈ క్రాప్ ముగుస్తుందని చెపుతున్నారని తెలిపారు.సదరు విషయం పై ఎఓ గణేష్ రెడ్డి వెంకట్రామయ్య సంప్రదించగా సిబ్బంది తక్కువగా ఉన్నారని నేను ఏమి చేయలేనని సమాధానం చెప్పారని, రైతులందరం కలిసి రెండు రోజుల్లో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు పశువులకు నిర్వహించే"గాలికుంటువ్యాధి నివారణ టీకాలు"కార్యక్రమం సోమవారం కోసూరు పశువైద్యశాలలో ప్రారంభించారు. మొవ్వ మండలపశువైద్యాధికారి డాక్టర్ బి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో100 నల్ల పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. కోసూరు సర్పంచ్ పెనుమూడి రమేష్ లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఉప సర్పంచ్ దళపతిరావు రామకృష్ణరాజు, కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ రాజుల పాటు రవి రైతులతో పాటు పాల్గొన్నారు. భట్లపెనుమర్రు పశు వైద్యశాలలో సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 75 పశువులకు టీకాలు వేశారు.

## బీసీలకు 34 % రిజర్వేషన్లు అమలు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : బీసీలకు టిడిపి హయాంలోనే న్యాయం జరుగుతుందని అందుకు ఉదాహరణ కూటమి ప్రభుత్వం ఉన్న ప్రజాప్రతినిధులు అని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు కనీసం 34 % రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు వెళ్లాలని బిసి సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ యలగాల నూకానమ్మ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరావు యాదవ్ సీఎం చంద్రబాబుకు సూచించారు.సోమవారం గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి నామినేటెడ్ పదవుల్లో, ప్రజాప్రతినిధులుగా ఎమ్మెల్యే, ఎంపి, రాజ్యసభ, ఎమ్మెల్సీగా బిసిలకు పెద్ద పీట వేసినందున ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర కన్వీనర్ మరిపిళ్ల తిరుమలేష్,ఎర్రబోతు రమణ, నమ్మి భాను ప్రకాష్, శివరామ్, కృష్ణ, దుర్గారావు రూపేష్, పట్నాల హరీ, తదితరులు పాల్గొన్నారు.

## వీఎంసీ పీజీఆర్ఎస్‌లో 16 దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఇతర అధికారులతో కలిసి సోమవారం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక సంబంధించినవి-6, ఇంజనీరింగ్-8, పబ్లిక్ హెల్త్ -1, రెవిన్యూ-1 మొత్తం కలిపి 16 ఫిర్యాదులను వచ్చినటుల తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత ఇతర అధికారులు పాల్గొన్నారు.

## న్యాయ ప్రముఖులను నియమించాలి

విశాలాంధ్ర, విస్సన్నపేట : రాష్ట్రంలో న్యాయపరంగా ప్రాధాన్యత ఉన్న లోకాయుక్త, రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌లను ప్రభుత్వం నియమించాలని విస్సన్నపేట మండలానికి చెందిన సామాజిక కార్యకర్త బొట్ల శివసత్యనారాయణ ప్రభుత్వానికి వినతిపత్రం పంపారు. ఈ విధుల నిర్వహణలో బాధ్యులను నియమించకపోవటంతో సామాజిక బాధ్యత కలిగిన యువకులు, బాధిత ప్రజల పరిస్థితి పలు సందర్భాల్లో ఆగమ్యగోచరంగా మారుతోందన్నారు. ఈ విషయాన్ని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ఆయన వినతిపత్రాలు పంపారు.

# నగరంలో ప్రజల ఇబ్బందులు గుర్తించండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంటూరు నగరం మునిగిపోతుండటం ఆందోళన కలిగిస్తుందని, రహదారులన్నీ నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్ ఆదేశానుసారం గుంటూరు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్, నాయకులు బొట్ల బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా బిళ్ళా సునీల్ మాట్లాడుతూ ఆదివారం గుంటూరులో కురిసిన వర్షానికి రోడ్లన్నీ నీటిలో మునిగిపోయి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి రాకపోకలు స్తంభించాయన్నారు. అత్యవసర స్థితిలో బయటికి వెళ్లాలన్నా రోడ్లు కనిపించని పరిస్థితి నెలకొందన్నారు. కోట్లాది రూపాయాలు పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ప్రజలను ఇబ్బంది పాలు చేయడం తగదన్నారు. పరిస్థితి చూస్తుంటే కార్పొరేషన్ పరిధిలో ఉన్నామా అనే అనుమానం తలెత్తుతుందన్నారు. మున్సిపల్ అధికారులు కారులో కాకుండా ద్విచక్రవాహనంపై వస్తే ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుస్తాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడా సక్రమంగా పనిచేయడం లేదన్నారు. పాత కాలువల స్థానం కొత్త కాలువల నిర్మాణాలతో కాంట్రాక్టర్లు బాగుపడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై కలెక్టర్ జోక్యం చేసుకుని మున్సిపల్ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇంజినీర్స్ డే సందర్భంగా లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏపీపీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అండ్ ఎఎస్ఈఈ (అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్) సభ్యుల కోసం జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి ఉచితంగా హెల్త్ చెకప్స్ చేశారు. రక్తపోటు, చక్కెర, ఈసీజీ పరీక్షలు, ఫిజియోథెరపీ కన్సల్టేషన్ వంటి సేవలు అందించారు. అనంతరం లలితా హాస్పిటల్ సైకియాట్రిస్ట్ డాక్టర్ పి.అజయ్ మానసిక ఆరోగ్యం, ముఖ్యంగా డిప్రెషన్, ఆందోళనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలుగజేశారు. ఈ పోటీ ప్రపంచంలో చాలా మంది వయసుతో సంబంధం లేకుండా డిప్రెషన్, ఆందోళనకి గురవుతున్నారన్నారు. ముఖ్యంగా పని ఒత్తిడి మూలంగా ఇంజనీర్లు ఎక్కువగా గురవుతున్నారని, దీని నుండి రక్షణ పొందాలంటే డాక్టర్ కౌన్సిలింగ్ అండ్ మెడికేషన్‌తో పాటు జీవనశైలి మార్పులు, వ్యాయామం, యోగా-ధ్యానం ద్వారా ఒత్తిడిని అధిగమించడం, నాణ్యమైన నిద్ర, సామాజిక కార్యకలాపాలలో చురుకుగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అధికమించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇంజనీర్ల శ్రేయస్సు కోసం అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు.

## సమస్యలు పరిష్కరిస్తాం: సబ్‌కలెక్టర్

విశాలాంధ్ర-తెనాలి : సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు భారీగా ఫిర్యాదులు వచ్చాయి. సబ్ కలెక్టర్ సంజనా సింహ అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూకు 5, మున్సిపాలిటీకి 5, పోలీసుకు 3, పంచాయితీరాజ్‌కు1, ఇరిగేషన్‌కు 1 చొప్పున మొత్తం 15 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఘట్కా గేమ్‌కు సెయింట్ థామస్ విద్యార్థులు

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని సెయింట్ థామస్ కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సోమవారం జరిగిన ఘట్కా క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ రోజ్ థామస్ మీడియాకు తెలిపారు. అండర్ 19 బాలికల విభాగంలో ప్రేమ్ కుమారి, అండర్ 19 బాలుర విభాగంలో ఏ.లోకేష్ బాబు, అండర్ 17 విభాగంలో జి.యశ్వంత్ తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. క్రీడాకారులను పాఠశాల యాజమాన్యంతో పాటు పీఈటీ రుద్రపాటి అర్జున్ రావును అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు, గ్రామానికి, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తేవాలని ప్రిన్సిపల్ రోజ్ థామస్ అన్నారు.

## యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నగరంలో డ్రైనేజీ వ్యవస్థకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఐటిసి వెల్కం హోటల్ పరిసరాలు, విద్యా నగర్, జీఎంసి ప్రధాన కార్యాలయం, కొత్తపేట జంక్షన్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రైన్లను, రోడ్ల పక్కన ఆక్రమణలను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా జీఎంసి చేపడుతున్న చర్యలకు నగర ప్రజలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ రమేష్ బాబు, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయ్యిన మొత్తం రూ. 14,25,243ల చెక్కులను సోమవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే మాధవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ... మా సమస్యలను గుర్తించి వెంటనే స్పందించినందుకు ధన్యవాదాలు అని పేర్కొన్నారు.

## విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలిలోని డీ-2 సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. 58 బృందాలుగా ఏర్పడిన 184 మంది అధికారులు, సిబ్బంది 5,185 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ దొంగతనాలు, అదనపు లోడు, అనధికార వాడకాలు గుర్తించి 46 మందికి రూ.3.52 లక్షల అపరాధ రుసుము విధించినట్లు ఆపరేషన్ డి.ఇ.అశోక్ కుమార్, విజిలెన్స్ డి.పి.ఇ. రవికుమార్ తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరం అని విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263,9440812361 నంబర్లకు వాట్సప్ ద్వారా తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎన్.మల్లికార్జున ప్రసాద్, శ్రీనివాసరావు, వెంకట్రావు, కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్, డిఈఈ, ఎఈఈలు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ బ్యాంక్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం కోలాహలంగా జరిగింది. ఎంఎల్సి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బ్యాంకు ఛైర్మన్‌గా హరిప్రసాద్, వైస్ ఛైర్మన్‌గా అక్కిదాసు వెంకటేశ్వరరావు, డైరెక్టర్లుగా శ్రీనివాసరావు, శ్యామ్, షేక్ జిలాని, శ్రీనివాసరావు, హరిప్రసాద్, పున్నారావు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, నాగయ్య, పూర్ణచంద్రరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అర్బన్ బ్యాంక్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అక్కిదాసు గౌరీశంకర్, కటారి వాసుదేవనాయుడు, కుద్దూస్, కరణం వెంకటేశ్వరరావు, వంగా సాంబిరెడ్డి, పెండ్యాల వెంకట్రావు, అమర్‌నాథ్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచం విజేతలను మాత్రమే గుర్తిస్తుంది..

**విజ్ఞాన్స్‌లో ఇంజినీర్స్ డే వేడుకలు**



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రపంచం ఎప్పుడూ కూడా విజేతలను మాత్రమే గుర్తిస్తుందని బెంగళూరులోని యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్ ప్రాజెక్ట్ అసోసియేట్ డైరెక్టర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌వీ నాడగౌడ అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం ప్రఖ్యాత ఇంజినీరు, భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్ డే వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాడగౌడ మాట్లాడుతూ అంతరిక్ష సాంకేతికత ప్రాధాన్యం గురించి విద్యార్థులతో పంచుకున్నారు. ప్రపంచం వేగంగా మారిపోతోందని, ఈ మార్పుల మధ్య మన చుట్టూ ఏమి జరుగుతుందో గమనించడం ప్రతి విద్యార్థి బాధ్యతని తెలియజేసారు. సుస్థిర అభివృద్ధి కోసం విద్యార్థులు కొత్త ఆవిష్కరణలతో ముందుకు రావాలన్నారు. హైదరాబాద్‌లోని స్కైరూట్ ఏరోస్పేస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీఎస్ కిరణ్ మాట్లాడుతూ భారతదేశానికి అవసరమైనది ఉద్యోగాల కోసం వెతికే యువత కాదు, ఉద్యోగాలను సృష్టించే ఇంజనీర్లు అవసరమని అన్నారు. మీ ప్రతిభను వినియోగించి కొత్త పరిశ్రమలు, కొత్త అవకాశాలను సృష్టించాలన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి వారికొచ్చే ఆలోచనలలో ఒక్కటైనా ఆచరణలోకి తేగలిగితే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మన దేశ భవిష్యత్, అభివృద్ధి యువత మీదే ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ ఎక్స్ పోలు అతిథులను ఆకట్టుకుంది. అత్యుత్తమంగా రూపొందించిన ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. పరిశోధన పత్రాలు సమర్పించిన అధ్యాపకులకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన బీసీ జెండాలు ఎగరాలి

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిస్తూ గ్రామగ్రామాన బీసీ జెండాలు ఎగరేలా జిల్లాల వారీగా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆవాల రామకృష్ణ మన్యం జిల్లా అధ్యక్షుడిగా నియమితులై నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ బీసీ 139 కులాల అవసరాలు, ఆకాంక్షల సాధనకై సంఘం ఎన్నో ఉద్యమాలు జరిపి విజయాలు సాధించిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా కులగణన, విద్యార్థుల వసతి గృహాల వంటి అంశాలపై మరింత బలమైన పోరాటం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర నేతలు కుమ్మర క్రాంతి కుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పోరెపల్లి మహేష్ తదితరులు పాల్గొని కొత్త జిల్లా అధ్యక్షుడిని అభినందించారు. ఆవాల రామకృష్ణ తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# గాలికుంటు వ్యాధి నివారణకు టీకా ఒక్కటే మార్గం

విశాలాంధ్ర-ఈపూరు : గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమని ఈ వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని కొండ్రముట్ల కొచ్చర్ల ముప్పాళ్ళ గ్రామాలలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి అక్టోబర్ నెల 15వరకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పశు వైద్య కేంద్రం పరిధిలో ఉన్న రైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆరు నెలలు వయసు దాటిన ప్రతి పశువుకు ఈ టీకాలు వేయించాలని అన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో పనిచేసే సామర్థ్యం తగ్గుతుందని, అలాగే పాడి పశువులలో పాల ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు. కావున ఈపూరు, బొల్లాపల్లి మండలాల పాడి రైతులు గాలుకుంటు వ్యాధి సోకక మునుపే పశువులకు టీకాలు వేయించాలని అన్నారు. సోమవారం 900 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ పశువైద్యాధికారిణి ఎం.సునీత, కొండ్రముట్ల పశువైద్యాధికారి గోపాల్ నాయక్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కళా ఉత్సవ్ జిల్లా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - వినుకొండ : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జిల్లా విద్యా శిక్షణా సంస్థ బోయపాలెం లో నిర్వహించిన కళా ఉత్సవ్-2025 పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. నాటకం విభాగంలో గిడుగు ఏకపాత్రాభినయం ప్రదర్శించిన పదో తరగతి విద్యార్థి ఇవివి శ్రీలక్ష్మి కి ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో మూడవ బహుమతి లభించింది. శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, జానపద నృత్యంలో విద్యార్థులు పాల్గొని ప్రశంసలు పొందారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి పొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు బి.శైలజ, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయినిగా డాక్టర్ వి. పద్మ వ్యవహరించారు.

## మైక్ కంప్యూటర్ అధినేత షఫీకి పురస్కారం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణంలో కంప్యూటర్ విభా గంలో విశేష సేవలందిస్తున్న మైక్ కంప్యూటర్ అధినేత షేక్ ఆదంషఫీ ఉత్తమ పాన్ ఇండియా అవార్డు అందుకు న్నారు. ఆదివారం గుంటూరులోని నెస్ట్ జనరేషన్ స్కూల్ ఆవరణలో ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కంప్యూటర్ శిక్షణలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను అవార్డును బహుకరించారు. గత 15 సంవత్సరాలుగా విద్యార్థులకు వివిధ కంప్యూటర్ విభాగంలో శిక్షణ ఇస్తూ వారి ఉద్యోగాభివృద్ధికి సహకరిస్తున్నందుకు గాను ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ వారి పాన్ ఇండియా ఉత్తమ ఉపాధ్యాయుడి బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు షఫీకు అభినందనలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలోనే గిరిజనుల అభివృద్ధి

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : కూటమి ప్రభుత్వంలోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.దారు నాయక్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వంలో గిరిజనుల సంక్షేమ పథకాలను రద్దు చేశారని కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు నేతృత్వంలో తిరిగి పునరుద్ధరించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో 1962 మారుమూల గిరిజన ప్రాంతాలకు రూ.1200 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టడం హర్షణీయం అన్నారు. గత వైసీపీ ప్రభు త్వంలో 16 సంక్షేమ పథకాలు రద్దు చేసి గిరిజనులను మోసం చేశారని విమ ర్శించారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

## సురవరం సంస్మరణ సభకు తరలిన సీపీఐ శ్రేణులు

విశాలాంధ్ర-దాచేపల్లి : అస్తమించిన ఎర్ర సూర్యుడు, మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభకు దాచేపల్లి శ్రేణులు సోమవారం నరసరావుపేటకు తరలివెళ్లారు. వారిలో నేతలు షేక్ హుస్సేన్, మందపాటి రమణారెడ్డి, వేముల వెంకటరెడ్డి, కొమెర వెంకట్రావు, బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, మురికిపూడి సర్వయ్య, ఆనంద్ కుమార్, రేవూరి రామయ్య, పత్తిపాటి నాగరాజు, కార్మికులు, మహిళలు, వ్యవసాయ కూలీలు ఉన్నారు.

## లయన్స్ ఆధ్వర్యంలో ఇంజనీర్లకు సన్మానం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా సృష్టికి ప్రతిసృష్టిని ఆవిష్కరించి ఆధునిక సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న ఇంజనీర్లు సాక్షాత్తు బ్రహ్మ స్వరూపులని లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షులు బండ్లమూడి వీరాంజనేయులు అన్నారు. ప్రపంచం గర్వించదగిన భారతీయ ఇంజనీర్, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మన దేశానికి అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ వారి జయంతి రోజును ఇంజనీర్స్ డేగా జరుపుకోవడం అందరికీ తెలిసిన విషయమే. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ క్లబ్ ఆవిర్భావం నుంచి ఇదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఉత్తమ ఇంజనీర్లను సత్కరిస్తుందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వీరాంజనేయులు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి డివిజన్ ఈఈ ఎం.మురళీ ధర్ రావు, ఏఈఈ అనూష, ఏఈ సుందర్ రావు, పంచాయ తీరాజ్ డీఈ శేఖర్ బాబు, ఎలక్ట్రికల్ ఏఈ పి.తిరుపతయ్య, మున్సిపల్ ప్లానర్ తోట చినసాంబశివయ్యలను సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు కంబాల వెంకటేశ్వరరావు, తవిటి భావనారాయణ, పెద్దింటి వెంకటేశ్వర్లు, పొన్నెకంటి కిషోర్ కుమార్, టి.చిన్న సాంబయ్య, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో బహుళ ప్రయోజనాలు: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెడుతున్న స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు లభిస్తాయని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. టెక్నాలజీ సాయంతో ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థనూ పూర్తి పారదర్శకంగా, లోపరహితంగా తీర్చిదిద్దుతోందన్న ఆయన ఆ విషయంలో ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1967కి ఫిర్యాదు చేయాలని సూచించారు. వినుకొండలో సోమవారం స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ ఎం.సురేష్ నాయక్ అధ్యక్షత వహించారు. స్థానిక 12వ వార్డు అంబేద్కర్ కాలనీలో లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. అనంతరం జీవీ మాట్లా డుతూ రాష్ట్రంలో 30 వేల వరకు రేషన్ దుకాణాలు సేవలు అందిస్తున్నాయని, మొత్తం 1.43 కోట్లమందికి ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రతినెలా ప్రభుత్వం ద్వారా పేదలకు చౌకబియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామని, ఈ పథకాన్ని ఇంకా సమర్థంగా అమలు చేయడం కోసం లబ్ధిదారుల ఇంటి గడపకు చేరేలా ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు ఉంటే రాష్ట్రంలో ఏ జిల్లాలోనైనా బియ్యం, సరకులు తీసుకొచ్చని చెప్పారు. మంత్రి నారా లోకేష్ తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 650కిపైగా సేవలు అందించడం ఎంతో అభినందనీయమ న్నారు. జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, పెమ్మసాని నాగేశ్వరరావు, కౌన్సిలర్లు డాక్టర్ దస్తగిరి షకీలా, నాగరాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు బొంకూరు రోశయ్య, నరసింహారావు, చికెన్ బాబు, మేడం రమేష్, ఎస్ కే జానీ, స్పెషల్ ఆఫీసర్ ఎం. సిద్ధ లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి:** ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు విపక్ష వైకాపా ఎమ్మెల్యేలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వంలో సమావేశాలు చాలా అర్థవంతంగా ఉంటున్నాయని, గతంలో ఉన్నట్లు గందరగోళాలు, దూషణలు లేవని అన్నారు. ప్రజల పట్ల వైసీపీ ఎమ్మెల్యేలకు ఏమాత్రం గౌరవం ఉన్నా ప్రజా సమస్యలపై మాట్లా డాలని హితవు పలికారు. సమస్యలపై చర్చిద్దామని, వైసీపీ ఎమ్మెల్యేలు మాట్లాడటానికి కావాల్సినంత సమయం కూడా ఇస్తామని, వాళ్లు అసెంబ్లీకి రావాలని కోరుతున్నామన్నారు. ఇప్పుడైనా ఆ ధైర్యం చేయకుంటే దుష్ప్రచారాలు కట్టిపెట్టాలన్నారు.

**17న స్త్రీ శక్తి విజయోత్సవ కార్యక్రమం**

ఈ నెల 17న గంగినేని ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు స్త్రీ శక్తి విజయోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, మహిళలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉచితవైద్య పరీక్షల శిబిరం కూడా ఉంటుందని అన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు 70–80 రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బ్యాడ్మింటన్ విజేతలకు జీవీ అభినందనలు

విశాలాంధ్ర - వినుకొండ : ఏపీ 10వ జూనియర్(అండర్ 19) బాలికల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు విజయం సాధించగా జట్టు సభ్యుల్లో 10 మందిలో 7గురు బాలికలు వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం మండలానికి చెందినవారు. వారిలో శానంపూడికి చెందిన ఆకుమల్ల సమీరా, శావల్యాపురానికి చెందిన కామినీడి కావ్యలు స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డుతో పాటు అక్టోబర్ నెలలో తమిళనాడులో జరిగే జాతీయ పోటీలకు ఏపీ జట్టు నుండి ఎంపికయ్యారు. వీరందరినీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అభినందించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిడి రాధాకృష్ణమూర్తి, పిఈటి ఝాన్సీ, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జోన నాయక్, జిల్లా సెక్రెటరీ వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ సహా గ్రామీణ మండలం అంతటా ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేస్తున్నట్లు పశు సువర్ధక శాఖ డాక్టర్ చెన్నయ్య తెలిపారు. దీనిలో భాగంగానే సోమవారం కొత్తూరు, పొందుగల గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు.

## ఆహ్లాదం, ఆనందం కలిగించేవి గ్రంథాలయాలే

విశాలాంధ్ర-దుర్గి: వినోదభరితమైన ఆహ్లాదం! విజ్ఞాన భరితమైన ఆనం దాన్ని కలిగించేవి గ్రంథాలయాలేనని ప్రఖ్యాతి గాంచిన శివశ్రీ చారిటబుల్ సంస్థ గుర్తించిందని దుర్గి గ్రంథాలయ అధికారి పి.వేణుగోపి తెలిపారు. కాలక్రమేణా వచ్చిన టెక్నాలజీని ఉపయోగించుకునేందుకు శివ శక్తి పథకం పెట్టి దాని ద్వారా విజ్ఞానం, వినోదం పాఠకులకు, విద్యార్థులకు అందించేందుకు మండల కేంద్రమైన దుర్గి గ్రంథాలయానికి రెండు కంప్యూటర్లు, ఒక టీవీసెట్, వాటికి సంబంధించిన మెటీరియల్‌ను బహుకరించారని ఆయన తెలిపారు. విజ్ఞానానికి సోపానాలు గ్రంథాలయాలేనన్నారు. పాఠశాలల్లో దొరకని పుస్తకాలు, పవిత్రగ్రంథాలు, ప్రముఖులు వ్రాసిన వ్యాసాలు కథలు, పద్యాలు మాస, పక్ష, వార, దినపత్రికలు తదితర పుస్తకాలు గ్రంథాలయాలలో దొరుకుతాయని చెప్పారు.

## శ్రీ సిమెంట్ యాజమాన్యం తీరుపై రైతుల ఆగ్రహం

విశాలాంధ్ర-కారంపూడి: మండలంలోని ఇనుప రాజుపల్లి గ్రామ సమీపంలో నిర్మించిన శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం తీరుపై ఇనుపరాజుపల్లి, కాచవరం గ్రామాల రైతులు గురజాల ఆర్డీవో మురళీకృష్ణకు సోమవారం ఫిర్యాదు చేశారని మండల టీడీపీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్ తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం రెండు గ్రామా ల రైతులు సుమారు 1,100 ఎకరాల సాగు భూమి ని అప్పగించారని, ఆ సమయంలో యాజమాన్యం స్థానిక రైతుల పిల్లలకు శాశ్వత ఉద్యోగాలు, ఇతరు లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిం దని చెప్పారు. అయితే ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తై రెండేళ్లు దాటినా ఇప్పటివరకు స్థానికులకు ఒక్క శాశ్వత ఉద్యోగం కూడా ఇవ్వలేదని, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారిని కూడా తొలగించి ఇతర రాష్ట్రాల వారికి అవకాశాలు కల్పిస్తున్నారని గోళ్ల సురేష్ యాదవ్ మండిపడ్డారు. "మేము భూములు ఇచ్చింది స్థానికుల భవిష్యత్తు కోసం. కానీ యాజమాన్యం మాత్రం స్థానికులను పక్కన పెట్టి బయటివారికి ఉద్యోగాలు ఇవ్వడం అసహ్య కరమైన విషయం. ఇకపై ఇలాంటి అన్యాయం సహించం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, స్థాని కులకు ఉద్యోగ అవకాశాలు వచ్చే వరకు మా పోరాటం కొనసాగుతుంది' అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మురళీకృష్ణ గ్రామస్థులకు న్యాయం చేయించే దిశగా యాజమాన్యంతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్థులు కారంపూడి తహశీల్దార్‌కు కూడా వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గుర్రపుసాల శ్రీనివాసరావు, చాలా కొండలు, సున్నా జనార్దన్, చాలా సుబ్బయ్య, జీనుగు నాగరాజు, కాచవరం గ్రామానికి చెందిన నాగూర్, వెంకయ్య, సురేష్ పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా కొత్తపల్లి రహదారి

విశాలాంధ్ర-మాచర్ల : ప్రభుత్వాలెన్ని మారినా గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం ఆ గ్రామానికి శాపంగా మారింది. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతుల మయంగా ఉండడంతో రోడ్డుపై వాహనాలు వెళ్లాలంటే నరకం కనబడుతుంది. మాచర్ల నుంచి కొత్తపల్లి మీదుగా నిత్యం వందలాది వాహనాలు నాగార్జునసాగర్, కొప్పునూరు, చింతల తండా, బెల్లంకొండ గ్రామాలకు ప్రయాణిస్తూ ఉంటాయి. కొత్తపల్లి గ్రామానికి ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల పాటు రోడ్డు గోతులమయమై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారులకు విషయంపై పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం కనబడటం లేదంటూ పలువురు వాపోతున్నారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే చాలు... చిన్నపాటి వర్షం కురిసినా కొత్తపల్లి గ్రామం ముందు రోడ్డంతా చెరువును తలపిస్తుంది. ఇప్పటికైనా మండలాభివృద్ధి అధికారి తమ గ్రామంపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

### మూత్ర సంబంధ వ్యాధులపై పరిశోధనలకు

# ఐఎంఏతో ఇఫ్సైటీ సంస్థ ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజారోగ్య పరిరక్షణలో దీర్ఘకాల మూత్ర వ్యాధులు ముఖ్యంగా దీర్ఘకాల యూరిన్ ఇన్ఫెక్షన్లు చాలా మందిలో ప్రధాన ఆరోగ్య సమస్యగా పరిణమించిందని ప్రస్తుతం వైద్యులు ఇస్తున్న చికిత్స విధానాలు, చాలా యాంటీబయాటిక్స్ పూర్తిగా ఇన్ఫెక్షన్‌లను నిరోధించడం లేదని, అందువల్ల తరచూ యూరిన్ ఇన్ఫెక్షన్లకు గురయ్యే వారి సంఖ్య పెరిగిపోతుందని.... ఈ నేపథ్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ శాఖ, యూఎస్ సంస్థ అయిన ఇఫ్సైటి రీసెర్చ్ సెంటర్‌తో పరిశోధనలకు అంగీకారం కుదుర్చుకున్నట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ తెలిపారు. సోమవారం ఆ సంస్థ ప్రతినిధులతో జీఎంఏ హాలులో ఒప్పంద పత్రాలపై ఇరువురు సంతకాలు చేశారు.

ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 300 మంది దీర్ఘకాల యూరిన్ ఇన్ఫెక్షన్ల గల వారి నుండి యూరిన్ నమూనాలను సేకరించి అత్యంత ఖరీదైన అతి సూక్ష్మస్థాయి పరీక్షలైన మాలిక్యులార్ -పిసిఆర్ పరీక్షలు, వివిధ మందుల యాంటీ మైక్రోబెయిల్ రెసిస్టెన్స్ సంబంధ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆ పరిశోధనలో ఏ యాంటీబయాటిక్స్ ఇన్ఫెక్షన్లను పూర్తిగా నియంత్రిస్తుందో తెలుస్తుందన్నారు. ఇఫ్సైట్ రీసెర్చ్ సెంటర్ సీఈవో డాక్టర్ సందీప్

**ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్**

నాదెండ్ల మాట్లాడుతూ స్వరాష్ట్ర అభిమానంతో అత్యాధునిక వైద్య పరీక్షలు, పరిశోధనలు మన రాష్ట్ర ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రజలలో గుర్తిస్తున్న వ్యాధుల నిర్ధారణకు, చికిత్సకు ఐఎంఏ వైద్యులు, పరిశోధన సంస్థలు సంయుక్తంగా కృషి చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. క్లినికల్ ఇన్ఫెక్షస్ డిసీజెస్ సొసైటీ (సిట్స్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె. కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ తమ సంస్థ తరపున ఈ పరిశోధనలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐఎంఏ, ఏఎంఆర్ కమిటీ చైర్మన్ డాక్టర్ పిఎస్ శర్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి. సేవ కుమార్, ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ అధ్య క్షులు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జవాబుదారీతనం పెంపొందించేందుకు రోల్ కాల్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, సమయ పాలన, జవాబుదారీతనం పెంపొందించేందుకు రోల్ కాల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీస్ స్టేషన్ అధికారులు ఉదయకాలపు రోల్ కాల్ నిర్వహించి, తమ పోలీస్ సిబ్బందికి వారు చేయవలసిన దైనందిన విధుల గురించి తెలిపి, వాటిని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది చక్కని యూనిఫాం ధరించాలని, సమయపాలన పాటించాలని, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని, పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో రైటర్, అసిస్టెంట్ రైటర్, కంప్యూటర్ ఆపరేటర్, కోర్టు విధులు, సాధారణ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన పనులను నిర్దేశ సమయంలో పూర్తి చేయాలని, ఏవైనా అవాంతరాలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని పోలీస్ సిబ్బందికి పోలీస్ స్టేషన్ అధికారులు సూచించారు. పోలీస్ సిబ్బందికి కేటాయించిన గ్రామాలు/వార్డులలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ శాంతిభద్రతల సమాచారాన్ని సేకరించి, ఎక్కడైనా ఏవైనా సున్నితమైన అంశాలు ఉంటే సదరు పోలీస్ స్టేషన్ అధికారి దృష్టికి తీసుకువచ్చి, వాటిని వేగంగా పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## క్రీడల్లోనూ రాణించాలి : జూలకంటి

విశాలాంధ్ర-మాచర్ల: విద్యతో పాటు క్రీడలలో విద్యార్థులు రాణించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని అలుగురాజుపల్లె నూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అండర్ 19 ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ క్రీడలలో రాణించిన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం క్రీడలకు హాజరైన ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల నుండి పాల్గొన్న విద్యార్థులలో ప్రతిభ కనబరిచిన జట్లుకు మొదటి బహుమతిగా రూ.25వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడవ బహుమతి రూ.15 వేలు అందజేశారు. విద్యార్థులకు మోటివేషన్ తరగతులను నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, కళాశాల ప్రిన్సిపాల్ జి జగదీశ్వర్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి ఫీవర్ సర్వే

విశాలాంధ్ర-పెదకూరపాడు : అచ్చంపేట మండల పరిధిలోని తాళ్ళచెరువు గ్రామంలో ఇంటింటికి ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు పరిసరాల పరిశుభ్రత గురించి, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచించారు. దోమలు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశీలించి శుభ్రపరిచారు. ఆశా కార్యకర్త రేపూడి రాణి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : మండల పరిధిలోని చౌక డిపోల వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు సిద్ధమైన 37,266 స్మార్ట్ రేషన్ కార్డులు ఇప్పటికే పిడుగురాళ్ల తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయి. గ్రామాల వారీగా చౌకడిపో డీలర్ల వద్ద ఉన్న మిషన్ల స్థానంలో కొత్త మిషన్లను అందజేసే కార్యక్రమాన్ని సివిల్ సప్లై శాఖ అధికారులు చేపట్టారు. దీనిలో భాగంగా స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేలా అవసరమైన మార్పులకు అనుగుణంగా ఆధునిక మిషన్లను డిపోలలో అందుబాటులో ఉంచినట్లు తెలుస్తోంది. సిద్ధమైన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామాల వారీగా పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ జె.మధుబాబు తెలిపారు.

## కేఎల్‌యూ ఆచార్యురాలికి జాతీయ అవార్డు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలు అందిస్తున్న కేఎల్ యూనివర్సిటీ, వేల్యూ ఎడ్యుకేషన్ సెల్ ఆచార్యురాలు కొడుకుల శంకరికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్, ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో గుంటూరులోని కెనెడి నెక్స్ట్ జనరేషన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాన్ ఇండియా ఎడ్యుకేషన్ అవార్డు కార్యక్రమం జరిగింది. ఈ సంవత్సరం.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు వేల సంఖ్యలో ఈ అవార్డుకు నామినేషన్లు చేసుకోగా కేవలం 1000 మంది మాత్రమే ఎంపిక

అయ్యారు. ఈ విద్యాసంవత్సరంలో.. కేఎల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ శంకరి కూడా అవార్డు పొందడం అభినందనీయం. అవార్డు పొందిన అనంతరం శంకరి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందని, ఇంతటి విజయానికి కారణం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉందని తెలియజేసారు. ఈ అవార్డు వృత్తి పట్ల తన భాధ్యతను మరింత పెంచిందని.. భవిష్యత్‌లో.. బోధన ద్వారా అనేక మంది విద్యార్థులను.. దేశం గర్వించేలా తీర్చిదిద్దుతానని తెలియజేసారు. ఈ సందర్భంగా సోమవారం వర్సిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, మోనిటరింగ్ కమిటీ స్పెషల్ అధికారిణి డాక్టర్ ఎ.వాణి, ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణా రెడ్డి, వాల్యూ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్ తదితరులు శంకరిని అభినందించారు.

## వీణా అవార్డ్స్-2025 పరిషత్‌లో పోటీపడుతున్న నాటక-నాటికలు

విశాలాంధ్ర-తెనాలి : కళలకాణాచి-తెనాలి, ఆర్ ఎస్ ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వాహణ లో జాతీయస్థాయి పంచమ పద్య నాటక, సాంఘిక నాటక, నాటిక పోటీలు, పంచమ జాతీయస్థాయి వీణా అవార్డ్స్-2025 కోసం సాంఘిక పద్యనాటక, సాంఘిక నాటిక, నాటక పోటీలలో అనేక నాటక సంస్థలు పోటీ పడుతున్నట్లు సినీ మాటల రచయిత, కళలకాణాచి అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా తెలియజేశారు. స్థానిక కొత్తపేటలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సాయిమాధవ్ వివరాలు తెలిపారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు పద్య నాటకాలు 9, సాంఘిక నాటకాలు 5, సాంఘిక నాటికలు 7 మొత్తం 21 ప్రదర్శనలు ఉంటాయి. ఈ ఏడాది ఏఆర్ కృష్ణ జాతీయ పురస్కారాన్ని రూ. 12,116/- నగదుతో గుంటూరుకు చెందిన సంస్కృతి సంస్థ అధినేత సర్రాజు బాలచంద్రకు, బుర్రా

సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని రూ. 25,000/- నగదుతో గుంటూరుకు చెందిన ఉప్పలపాటి సైదులు, వేదగంగోత్రి వరప్రసాద్ జాతీయ రంగస్థల నిర్వాహక పురస్కారాన్ని రూ. 11,116/- నగదుతో సత్తెనపల్లికి చెందిన నూతలపాటి సాంబయ్యకు ఇదే వేదికపై ప్రదానం చేయనున్నట్లు డాక్టర్ సాయిమాధవ్ తెలిపారు. పద్య నాటకంలో ఉత్తమ ప్రదర్శనకు ప్రథమ బహుమతి లక్ష రూపాయలు, బంగారు వీణ, ద్వితీయ బహుమతి రూ. 75 వేల, వెండి వీణ, తృతీయ బహుమతి రూ. 50 వేలు కాంస్య వీణ బహూకరిస్తారు. సాంఘిక నాటకాలకు ప్రథమ బహుమతి రూ. 60 వేలు, బంగారు వీణ, ద్వితీయ బహుమతి రూ. 50 వేలు, వెండి వీణ బహూకరిస్తారు. ఇవి కాక ప్రదర్శనా పారితోషయం పద్య నాటకానికి రూ. 50 వేలు, సాంఘిక నాటకానికి రూ. 40 వేలు, సాంఘిక నాటిక రూ. 30 వేలు ప్రదర్శనా పారితోషికం ఉంటుంది. ఇవి కాక రచయిత పారితోషికాలు, వ్యక్తిగత బహుమతులకు నగదు పారి తోషికాలు కూడా ఉంటాయని డాక్టర్ సాయిమాధవ్ తెలిపారు. డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు రూపొందించిన నాటి నటనాలయం డాక్యుమెంటరీ ప్రదర్శనతో పాటు ఐనాల మల్లేశ్వరరావుకు దశ సహస్రాధిక పద్య విపంచి బిరుదు ప్రదానం కార్యక్రమాలు ఇదే వేదికపై ఉంటాయి. విలేకర్ల సమావేశంలో చెరుకుమల్లి సింగారావు, వేమూరి విజయభాస్కర్, గోగినేని కేశవరావు, షేక్ అబ్దుల్ హకీం జాని, దేవరపల్లి భావని, ఐనాల మల్లేశ్వరరావు,కొండమూది రమేష్ తదితరులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I, SHAIK NAGIYULLA (Old Name), S/o. (Late) ISMAIL, Resident of Door No: 92-14-1240/1, Bhavanipuram, 1st Line, Guntur - 522004, Guntur District, Andhra Pradesh. I have changed my name as SHAIK MAHAMMAD NAJIMULLA (New Name) S/o. (Late) ISMAIL. Hereafter my name is known as SHAIK MAHAMMAD NAJIMULLA (New Name) S/o. (Late) ISMAIL.

దీ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ పోస్టల్ ఎంప్లాయిస్ మూచ్యువల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ & అండ్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బలిజేపల్లివారి వీధి, మారీసుపేట, తెనాలి - గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ సర్వ సభ్య సమావేశము నోటీసు

(సభ్యులకు మాత్రమే)

ది. 14-09-2025 జరుగవలసిన మన సొసైటి సర్వసభ్య సమావేశము భారీవర్షాలవల్ల ఆగిపోయినది. కావున ది. 05-10-2025వ తేదీ ఆదివారం ఉ॥గం.10.00లకు మన సొసైటి చైర్మన్ శ్రీ కె. సాంబశివరావు గారి అధ్యక్షతన తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం, తెనాలిలో ఇంతకు ముందు ప్రకటించిన ఎజెండాపైనే జరుగును. కావున సభ్యులు సకాలములో హాజరై కార్యక్రమమును జయప్రదము చేయవలసినదిగా మనవి.

ఇట్లు
తెనాలి, డి. చక్రధర చౌదరి,
తేది:15-09-2025 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ది తెనాలి పోస్టల్ ఎంప్లాయిస్ & జిడియస్ మూచ్యువల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ & అండ్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ నెం.1700, తెనాలి సర్వ సభ్య సమావేశము నోటీసు

(సభ్యులకు మాత్రమే)

ది.14-09-2025 జరుగవలసిన మన సొసైటి సర్వసభ్య సమావేశము భారీవర్షాలవల్ల ఆగిపోయినది. కావున ది. 05-10-2025వ తేదీ ఆదివారం ఉ॥గం.10.00లకు మన సొసైటి చైర్మన్ శ్రీ ఎ.పోతురాజు గారి అధ్యక్షతన తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం, తెనాలిలో ఇంతకు ముందు ప్రకటించిన ఎజెండాపైనే జరుగును. కావున సభ్యులు సకాలములో హాజరై కార్యక్రమమును జయప్రదము చేయవలసినదిగా మనవి.

ఇట్లు
తెనాలి, డి.యల్.కాంతారావు
తేది:15-09-2025 సెక్రటరి

**దస్తావేజులు పోయినవి**

గుంటూరు జిల్లా, మంగళగిరి, గణపతినగర్, విజె జూనియర్ కాలేజీ, ఆర్య ఎమ్రాల్డ్ అపార్ట్‌మెంట్, ప్లాట్ నెం.301 నివాసి దేవరంపాటి వంశీ కృష్ణ (సెల్:93969 36969) తండ్రి: వెంకట సుబ్బారావు, నా పేరిట గల ఆస్తికి చెందిన లింకు దస్తావేజులు ద.నెం.3060/2011 (విక్రయ దస్తావేజు), ద.నెం.3563/2015 (విక్రయ దస్తావేజును రద్దు దస్తావేజు) మరియు ద.నెం.2230/2014 (సింపిల్ మార్టిగేజ్ డీడ్ విత్ అవుట్ పొసెషన్) లను ది.08-09-2025న గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయమునకు సమీపములోని ఫొటోస్టాట్ సెంటర్ దగ్గర పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

**పుట్టిన తేది మార్పు**

నేను, నేలపాటి వెంకట జస్ను, తండ్రి: నేలపాటి సుధీర్ బాబు, వయస్సు: 21సం॥లు, నివాసం: డోర్ నెం.8-138/113, విల్లా నెం-196, రెయిన్ ట్రీపార్కు ద్వారక కృష్ణా విల్లాస్, ఖాజ, మంగళగిరి, గుంటూరు జిల్లా-522510, ఆంధ్రప్రదేశ్, ఇండియా, తెలియజేయునది ఏమనగా నా CBSE 10వ తరగతి పాస్ సర్టిఫికేట్ నందు నా యొక్క పుట్టిన తేదీ 14-02-2004 అని తప్పుగా నమోదు చేయబడినది. నా యొక్క జనన ధృవీకరణ పత్రం & పాస్‌పోర్ట్ ప్రకారం నా యొక్క సరైన పుట్టిన తేది 17-02-2004. నా రోల్ నెం: 4144864 మరియు పాస్ అయిన సంవత్సరం: 2019. కావున నా యొక్క సరైన పుట్టిన తేది 17-02-2004 అని ప్రకటింపమన్నాను.

**ఇంటిపేరు సవరణ గురించి**

గుంటూరు జిల్లా, తాడేపల్లి(మం), మెల్లెంపూడి గ్రామమునకు చెందిన EMANI SIVARAMI REDDY, S/o. RAMANA REDDY అను నా ఇండియన్ పాస్‌పోర్టులో EMANI SIVARAMI REDDY అని ప్రింటు అయినది. నా ఆధార్, పాన్ కార్డులో EMANI SIVARAMI REDDY అని కరెక్టుగానే వున్నది. ఇండియన్ పాస్‌పోర్టులో వున్న EMANI SIVARAMI REDDY పేరును EMANI SIVARAMI REDDYగా మార్చగలరు.

**EMANI SIVA RAMI REDDY,**
Mallempudi, Tadepalli(Md), Guntur Dist.

## కేంద్ర సహాయ మంత్రిని కలిసిన వెలగలేటి

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బీజేపీ రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్ నరసాపురం ఎంపీ, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణులను గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచిస్తూ అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్, సీనియర్ నాయకులు ఈమని మాధవరెడ్డి, యువమోర్చా నాయకులు జంధ్యాల సాయి రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు రూ.30వేలు ఇవ్వాలి : ఆరేటి

**విశాలాంధ్ర-పొన్నూరు:** ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర రూ.30 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. పొన్నూరు పట్టణంలో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ కార్యదర్శి కే రత్నబాబు అధ్యక్షతన సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి ప్రారంభమై ఐలాండ్ సెంటర్లోని ఆటో స్టాండ్ వద్దకు సాగింది. ఆటో కార్మికులు వాహన మిత్ర అమలు చేయాలని, జీవోను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ప్రాణ సంకటముగా ఉన్న జీవులను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మికుల వలె ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆటో యూనియన్ నాయకులు ఎస్ కే బాబావాలి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో స్త్రీలకు ఉచిత ప్రయాణం అనుమతించిన రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల్ని నడిరోడ్డుపై పడేసిందని ఆటో కార్మికుల పొట్ట కొట్టిందని అన్నారు. బాబురావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలోనే గాక ఆటోలలో కూడా స్త్రీలకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేసే విధముగా ఆటో కార్మికుల్ని ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాటూరి విజయకుమార్, సుబ్బయ్య, దేవా, బడేసా, నీల రవి, సుధీర్, ప్రసాద్, అశోక్, ప్రభుదాసు ఆటో యూనియన్ జిల్లా కౌన్సిల్ నెంబర్ వెంకట్రావు, గుమ్మడి కిషోర్, బాబు, ఎస్కే జానీ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి

**విశాలాంధ్ర-చిలకలూరి పేట:** సమ స్యలు పరిష్కరించాలని కోరుతూ చిలకలూరిపేటలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబుకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 1.25 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వెంటనే సమస్యలను పరిష్కరించక పోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. వినతి పత్రంలో ఉద్యోగులు ప్రధానంగా ఆరు అంశాలను ప్రస్తావించారు. తమ విద్యా అర్హతలకు అనుగుణంగా విధులు అప్పగించాలని, పదేపదే ఇంటింటికి తిరిగి చేసే సర్వేలు, ఇతర పనుల నుండి తమకు విముక్తి కల్పించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వారి మాతృశాఖలకు బదిలీ చేయాలని కోరారు. కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు, సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయిస్తున్నారని, ఈ ఒత్తిడి నుండి విముక్తి కల్పించాలని అభ్యర్థించారు. తమ సమస్యలకు 15 రోజుల్లోగా పరిష్కారం చూపాలని అభ్యర్థించారు. లేని పక్షంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

## అర్జీలను గడువులోపు పరిష్కరించాలి : జేసీ

**విశాలాంధ్ర-గుంటూరు సిటీ:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపు నాణ్యతగా పరిష్కరించాలని, ఎలాంటి సందర్భంలో కూడా బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకూడదని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డిఆర్‌ఓ ఎన్ఎస్ కె.ఖాజావలి ప్రజల నుండి 221 పిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శక పంపిణీ

**విశాలాంధ్ర-మాచర్ల:** అభివృద్ధి సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గత జగన్ పాలనలో అవినీతి అరాచకం రాజ్యమేలిందన్నారు. కనీసం కొంతమందికి కూడా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయలేక పోయాడన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, అలాంటి మనిషి ముఖ్యమంత్రిగా మనకు ఉండటం రాష్ట్రానికే వరం అన్నారు. విదేశీయులకు భరోసా కల్పించి రాష్ట్రానికి కోట్లాది రూపాయలు పెట్టుబడులుగా తీసుకు వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల హామీల లో భాగంగా ప్రతి పథకాన్ని విజయవంతంగా ప్రారంభించి చూపిస్తున్నారు. అతి కొద్ది రోజుల్లో మాచర్ల రూపురేఖలు మారడం ఖాయమన్నారు. ఐదు మండలాలకు 98,331 స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం పలువురు మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళీ, ఐదు మండలాల తహసీల్దార్లు కిరణ్ కుమార్, వెంకటేశ్వర నాయక్, కరుణ కుమార్, రాజశేఖర్, కనకం మేరి, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ రాజబోయిన మధు, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతుల అభివృద్ధే సంగం డెయిరీ లక్ష్యం

**విశాలాంధ్ర-పెదకాకాని :** పాడి రైతుల అభివృద్దే ప్రధాన లక్ష్యమని సంగం డెయిరీ బీఎంసీ మేనేజర్ టి.ఆనంద్ రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెనిగండ్ల సొసైటీలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 213 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.14,36,645ల బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సంగం డెయిరీ అందించు పథకాలు, ప్రోత్సాహకాలను ఉపయోగించుకోవాలన్నారు. సంఘం అధ్యక్షులు పులగం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సంగం డెయిరీ వారు అందించు పథకాలను ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం కోడూరు లక్ష్మి రూ.2,92,116, రెండవ వారు కొండమడుగుల రామ్మోహన్ రెడ్డి రూ.1,36,781 బోనస్‌లు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగం పాలకవర్గం సభ్యులు వేతన కార్యదర్శి కె.సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ సిహెచ్ శివకృష్ణ, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

## ఐసెట్ అడ్మిషన్ల తేదీలు పొడిగించాలి: ఏఐఎస్ఎఫ్

**విశాలాంధ్ర-మంగళగిరి :** రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాల్లో ఐసెట్ అడ్మిషన్ల తేదీలను వెంటనే పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ డిమాండ్ చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి యశ్వంత్, విశ్వవిద్యాలయ అధ్యక్షుడు పాలెం నాసరయ్యలు మాట్లాడుతూ సెలవు దినాలను పట్టించుకోకుండా అలాట్‌మెంట్ ఆర్డర్లు విడుదల చేసి, విద్యార్థులను అయోమయంలోకి నెట్టేసారని తీవ్రంగా విమర్శించారు. కౌన్సెలింగ్ నెలలు తరబడి సాగి, అడ్మిషన్‌లకు మాత్రం ఒకే రోజు సమయం ఇవ్వడం అన్యాయం అని పేర్కొన్నారు. సెలవులు ఉండడం వల్ల చాలా మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్లు తెచ్చుకోలేక సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం రెండు రోజులపాటు అడ్మిషన్ల ప్రక్రియను పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జాన్ సైదా, గణేష్, చందు, అఖిల్, వెంకీ నాయక్, గుంటూరు నగర కార్యదర్శి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**విశాలాంధ్ర-దుర్గి:** ఉచిత కంటి వైద్య శిబిరం నకు విశేష స్పందన లభించింది. మండల పరిధిలోని అడిగొప్పుల ఎస్సీ కా లనిలోని ఇమ్మానుయేలు చర్చి వద్ద సోమవారం మాచర్ల జడ్సన్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ,ఎల్వి ప్రసాద్ కంటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు శిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి 185 మంది హాజరయ్యారు. వారికి డాక్టర్స్ కంటి పరీక్షలు జరిపి వారిలో 40 మందిని ఆపరేషన్స్ కోసం ఎంపిక చేశారు. 55మందికి కళ్ల అద్దాలు కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో విజన్ సెంటర్ కోఆ ర్డినేటర్ మల్లేష్, టెక్నీషియన్స్ ప్రసాద్, అనూష, హనుమంత రావు సహకరించారు. క్యాంప్ నిర్వాహకులుగా మాచర్ల జార్జి, మాచర్ల సుందరరావు, క్యాంప్ వాలంటీర్స్‌గా కార్తిక్, జశ్వంత్ వ్యవహరించారు.

విలేకరులు కావలెను

విశాలాంధ్ర దినపత్రికకు కృష్ణాజిల్లాలో
దిగువ పేర్కొన్న మండలాల్లో పనిచేయుటకు
విలేకరులు కావలెను

ఇంటర్మీడియట్ చదివి తెలుగు భాషా పరిజ్ఞానం కలిగి సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన ఉన్న అభ్యర్థులు అర్హులు

పనిచేయవలసిన మండలాలు :
పెనమలూరు, కంకిపాడు, మచిలీపట్నం టౌన్, పెడన రూరల్, నాగాయలంక, అవనిగడ్డ, హనుమాన్ జంక్షన్, గుడ్లవల్లేరు, ఉయ్యూరు, పామర్రు, మోపిదేవి

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ : 8074662146, 9490338489

గమనిక : ఆయా ప్రదేశాలల్లో స్థానికులై ఉండాలి

విశాలాంధ్ర జిల్లా కార్యాలయం
ఈడేపల్లి, ఆంజనేయస్వామి గుడి ఎదుట, మచిలీపట్నం

## తురకపాలెం మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చెల్లించాలి

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** గుంటూరు జిల్లా తురకపాలెంలో అంతుపట్టని వ్యాధితో మృతిచెందిన కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, ఈ మిస్టరీ మరణాలపై శవ పరీక్షలు చేసి హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిచే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విదసం(విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. విదసం ఐక్య వేదిక ప్రతినిధులు మరణించిన వారి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మృతుల ఫొటోలు పట్టుకుని తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ తురకపాలెం దళితవాడకు క్వారీ బుగ్గితో నిండిన గుంతల్లో కాలుష్య నీటిని సరఫరా చేశారని, ఆ నీటిలో వ్యాధికారక బాక్టీరియా, యురేనియం అవశేషాలు ఉన్నట్టు నివేదికలు బయటపడ్డాయన్నారు. కిడ్నీ, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపే బాక్టీరియాలు మట్టి, నీటి నమూనాల్లో ఉన్నట్లు చెన్నై ల్యాబ్ నివేదికలు స్పష్టం చేశాయన్నారు. ఈ నీటి కాలుష్యం వల్లే ఈ మూడు నెలలలో 30 మందికి పైగా ఆకస్మికంగా మృతిచెందారని, ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశా రు. ఈ మరణాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు నివేదికలు ప్రభుత్వా నికి అందించి మరణాలను కట్టడి చేయా ల్సిన జిల్లా వైద్య అధికారులు నిర్లక్ష్యం వహించారని, ప్రజలకు శుద్ధి నీటిని అందించాల్సిన గ్రామీణ నీటి సరఫరా అధికారులకు కూడా బాధ్యత ఉందని చెప్పారు. గుంటూరు దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు నీలాంబరం, రవి, జాజి, ఓంకార్, బూల భాస్కరరావు పాల్గొన్నారు

# గీతకార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలిన ప్రభుత్వం

## - కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు ఆందోళన

**విశాలాంధ్ర - ఉయ్యూరు :** కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తారన్న ఆశతో కూటమి పార్టీలను గెలిపిస్తే అధికారం చేపట్టిన తరువాత గీత కార్మికుల కోసం ప్రభుత్వం ఒక్క నూతన పథకం ప్రవేశపెట్టలేదని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్ర రావు ఆందోళన వ్యక్తంచేశారు. స్థానిక నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, నూతన పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటారన్న ఆశతో ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపిస్తే ఒక్కనూతన పథకం కూడా ప్రవేశపెట్టలేదన్నారు. కల్లుగీత వృత్తికి రక్షణ కల్పించాలని కోరుతుంటే మద్యం షాపులు, బార్లు పేరుతో భ్రమలు కల్పించారని, బార్లు గీత కార్మికులపేరుతో బడాబాబులు, మద్యం వ్యాపారులకు మేలు కల్పించారని ఆరోపించారు. గీత కార్మికులకు గత ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియో ప్రకటించినప్పటికీ విధివిధానాలు ప్రకటించక పోవడంతో అందని ద్రాక్షలా మిగిలిపోయిం దని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియో పునరుద్ధరించక పోవటంతో చెట్లుపై నుండి పడిపోయి ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు దిక్కుతోచక ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందక అల్లాడుతున్నారని విచారం వ్యక్తంచేశారు. కేరళ, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల్లో ఉన్న కల్లుగీత వృత్తిని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కల్లు గీత వృత్తికి రక్షణ, ఉపాధి, మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. హైబ్రిడ్ తాటి, ఈత వనాలను ప్రోత్సహిస్తూ నీరా పరిశ్రమ ఏర్పాటు చేయాలని, ఎక్స్ గ్రేషియో పునరుద్ధరించి తాడి చెట్టుపై నుండి పడిపోయిన గీత కార్మికులకు మూడు కేటగిరీ లుగా విభజించి చనిపోయిన వారికి రూ. 10లక్షలు, పూర్తి వికలాంగత్వం ఏర్పడిన వారికి రూ 5లక్షలు, తాత్కా లిక వికలాంగులకు లక్ష చొప్పున ఎక్సైజ్ శాఖ ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని, ఎక్సైజ్ శాఖలో పెచ్చుమీరి పోయిన అవినీతిని అరికట్టి, ధరాఖాస్తు చేసుకున్న గీత కార్మికులకు గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలని, మత్స్య కార భరోసా మాదిరిగా వృత్తి సాగనిసమయంలో కల్లుగీత భరోసా పథకం ప్రవేశపెట్టి రూ.25 వేలు ఇవ్వడంతో పాటు ఇతర డిమాండ్లు నెరవేర్చి సమస్యలు పరిష్కరిం చాలన్నారు. భూపతి బోడిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు పామర్తి వెంక టేశ్వరరావు, జిల్లా సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, పామర్తి శ్రీను, వీరంకి నాగరాజు, తాతా శ్రీనివాసరావు, కొనకళ్ల వెంకట్రావు, గీత కార్మికులు పాల్గొన్నారు. కౌలురైతు సంఘం జిల్లా కార్య దర్శి రంగారావు, శివనాగేంద్రం సంఘీభావం ప్రకటించారు.

## యలవర్తికి లైన్స్‌సభ్యుల సత్కారం

**విశాలాంధ్ర - గుడివాడ :** దేశం గర్వించదగ్గ ఇంజనీరింగ్ నిపుణులు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజనీర్స్ డే) సందర్భంగా ఇంజనీరింగ్ గోల్డ్ మెడల్ పట్టాభద్రలు మాజీ మున్సిపల్ చైర్మన్, స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావును గుడివాడ లైన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సోమ వారం స్థానిక రాజేందర్ నగర్‌లో యలవర్తి నివాసం వద్ద ఇంజనీరింగ్ డే సంద ర్భంగా లైన్స్ సభ్యులు యలవర్తి శ్రీనివాసరావును క్లబ్ సభ్యులు ఘనంగా సత్క రించారు. ఈ సంద ర్భంగా లైన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ విషంశెట్టి కృష్ణకిషోర్ మాట్లాడుతూ మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి ఇంజనీరింగ్ చదివిన అను భవంతో చేపట్టిన అభి వృద్ధి కార్యక్రమాలు, అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రెసిడెంట్ గుడివాడ వేణుగోపాలస్వామి, సెక్రెటరీ కిలారిశెట్టి సతీష్, ట్రెజరర్ కాసరనేని శ్రీనివాస్, సభ్యులు లఘువరపు శివసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు గొల్లేరుకు ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ సత్కారం

**విశాలాంధ్ర - గుడివాడ :** నిరంతర శ్రమ విద్యార్థులలో జిజ్ఞాస కలిగే విధంగా విద్యా బోధన చేస్తున్న ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నిడమానూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొల్లేరు శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డ అందుకువడం అభినందనీయమాని కృష్ణాజిల్లా ఎన్‌జీవో అసోసియేట్ అధ్యక్షుడు షేక్ ఫరీద్ భాష అన్నారు. సోమవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ వ్యవస్థాపకులు డిఆర్‌బి ప్రసాద్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత కొల్లేరు శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకోవటం అభినందనీయమన్నారు. గొల్లేరు ఉపాధ్యాయునిగా గానే కాకుండా విద్యార్థులకు సృజనాత్మక అంశాల్లో తర్ఫీదును ఇవ్వటంలో అందె వేసిన చెయ్యన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోకా మాధవరావు, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, ఎఫ్‌పిఎఫ్ సభ్యులు పి.అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వాసవిలో జాతీయ ఇంజనీర్స్ డే

**విశాలాంధ్ర - పెడన :** భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165 జయం తి వేడుకలు వాసవి ఇంజ నీరింగ్ కళాశాలలో ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ సిపిడిసిఎల్ పెడన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి హెచ్ ఆర్ కె మాణిక్యాలరావు జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భారతదేశపు తొలి ఇంజనీర్ అయిన ఆయన అనేక నీటిపారుదల ప్రాజెక్టులను కర్ణాటక మరియు ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించారని కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్ బాబు తెలి పారు. ఆయన ఆదర్శంగా అనేక మంది భారతీయులు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించి తద్వారాదేశాభివృద్ధికి తమ తోడ్పాటు అందించారని కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి రాజా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ ప్రదర్శన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి ఆర్ ఎస్ రెడ్డి వైస్ ప్రిన్సిపల్ డి రాజా రమేష్ విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు .

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

**విశాలాంధ్ర - తిరువూరు :** స్థానిక శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశాలలో భారతరత్న మోక్షగుండం విశ్వే శ్వరయ్య జయంతి సందర్భంగా సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సివిల్, ఎలక్ట్రి కల్, మెకానికల్ విభాగాలు, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల

## శ్రీ వాహినిలో ఇంజనీర్స్ డే వేడుకలు

ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. నాగేంద్రబాబు మాట్లాడుతూ కళాశాలలో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడానికి అవ సరమైన అన్ని రకాల అధునాతన లాబొరేటరీస్ అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని విశ్వేశ్వరయ్య లా ఉత్తమ ఇంజనీర్లుగా ఎద గాలని సూచించారు.కళాశాల కరస్పాండెంట్ శ్రీ పోట్రు నాగేశ్వరరావు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కృషి చేయాలి అన్నారు. విభాగాధిపతి శ్రీ ఎజీ వీశీంవం మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య గారి ఆటోబయోగ్రఫీ చదివి విద్యార్థులు ప్రేరణ పొందాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ కే. కిరణ్ కుమార్,సివిల్ విభాగాధిపతి రాంబాబు, అలాగే మెకానికల్ విభాగాధిపతి దాసు,విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**విశాలాంధ్ర - విస్సన్నపేట:** విస్సన్నపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హెూమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని క్లబ్ జిల్లా ప్రముఖులు డా.ఎన్.టి.వెంకటేశ్వరరావు ప్రారంభించగా, హెూమియో వైద్య నిపుణులు డా.శ్రీపతి కృష్ణప్రసాద్ రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయల అరుణకుమారి, తుమ్మూరు జగన్మోహనరెడ్డి, సభ్యులు రవిమోహన్, పల్లిపాం లక్ష్మయ్య, జువ్వా అప్పారావు, దారా సూరిబాబు, ముంగా జయరాజు పాల్గొన్నారు.

## రజకులపై దాడులు అరికట్టాలి : రజక సంఘ నాయకులు

**విశాలాంధ్ర - గుడివాడ :** రాష్ట్రంలో రజక సంఘీయులపై జరుగుతున్న దాడులను అరికడుతూ, రజకులకు రక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి ఏపీ రజక వృత్తిదారుల సంఘ ప్రధాన కార్యదర్శి చిక్కవరపు వెంకటరెడ్డయ్య అన్నారు. సోమవారం స్థానిక జగన్నాధపురంలోని గుడివాడ పట్టణ రజక సంఘం అధ్యక్షుడు నైనవరపు శేషుబాబు స్వగృహంలో సంఘీయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘీయులపై జరుగుతున్న దాడులను సంఘ పెద్దలు ఖండించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి వెంకట రెడ్డయ్య, రజక సంఘ రాష్ట్ర నాయకులు పెనుమూడి నాగేశ్వరరావు, ఓలేటి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బీమవరపు ఉమశ్రీని వాసరావు, పోలుకొండ నాగబాబు, శంకరవరప్రసాద్, పాల్గొన్నారు.

## డాక్టర్ కొల్లూరికి జాతీయ సేవా ప్రతిష్టాత్మక అవార్డు

**విశాలాంధ్ర - పెడన :** పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) కు మరొక అరుదైన అత్యున్నత గౌరవం భారత దేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా పురస్కారం ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. డా. కొల్లూరి కరోనా కష్ట కాలంలో ప్రజలకు అందించిన అనేక విశిష్ట సేవలను గుర్తించిన నిర్వాహకులు డా. కొల్లూరికి భారత దేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సామాజిక వర్గంలో సేవా రంగంలో భారత దేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న ఒకే ఒక్కడు డా. కొల్లూరి కావడం ఆర్యవైశ్యులు ఎంతో గర్వించదగ్గ విషయం. దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖ రత్న కళాపరిషత్ సంస్థల వారు విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన అవార్డుల ప్రధానో త్సవ కార్యక్రమానికి పైడా విద్యా సంస్థల చైర్మన్ పైడా కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్ డాక్టర్ సూర్యనారాయణ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖ కళాపరిషత్ వ్యవస్థాపకులు పీఏ భాస్కరరావు ప్రతిభ క్రీడ అండ్ సంస్కృతిక ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు తదితరులు డా. కొల్లూరి ని దుశ్శాలువ వస్త్ర కిరీటంతో సత్కరించి ప్రశంసా పత్రంతో పాటు అవార్డును అందజేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు డా. కొల్లూరికి అభినందనలు తెలియజేశారు.

## ఫిజిక్స్‌వాలా పీడబ్ల్యూ విద్యా సంస్థ ఏపీలో తొలి సమాచార కేంద్రాన్ని ఏర్పాటు

**విశాలాంధ్ర- విజయవాడ ( లబ్బీపేట) :** విజయవాడ గురునానక్ రోడ్‌లో ఫిజిక్స్‌వాలా పీడబ్ల్యూ విద్యా సంస్థ ఏపీలో తొలి సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సౌత్ ఇండియా హెడ్ అమిత్ సింగ్ రాథోర్, రీజినల్ అకాడమిక్ హెడ్ సంజయ్ కుమార్ శర్మ, విజయవాడ కేంద్రం నిర్వాహకులు సుధాకర్ రెడ్డి తదితరులు రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ సింగ్ రాథోర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు విద్య కూడళ్లు అని, విద్యార్థులు ఎన్నో ఆకాంక్షలతో నీట్, జేఈఈ కు సన్నద్ధం అవుతుంటారని చెప్పారు. విద్యా ర్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, వారికి కౌన్సిలింగ్ చేసేందుకు సమాచార కేంద్రాన్ని విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశాలకు సంబంధించిన సమాచారం, నీట్, జేఈఈ పరీక్షలకు ఎలా సాధన చేయాలి అనే అంశాల పై అవగాహన కల్పించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు సమాచార కేంద్రంలో కౌన్సెలర్స్, గ్రౌండ్ టీం అందుబాటులో ఉంటారన్నారు. ఆఫ్ లైన్ విద్యా పీఠ్ సెంటర్ ను విజయవాడలో ప్రారంభించేందుకు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయని, అక్టోబర్ లో పరీక్ష ఉంటుందని తెలిపారు. పిడబ్ల్యూ అండ్ జె వి పార్టనర్స్ సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ జేఈఈ, నీట్ వంటి పరీక్షలపై కౌన్సెలింగ్ పొందడానికి విద్యార్థులు సమాచార కేంద్రాన్ని సందర్శించవచ్చన్నారు. పీడబ్ల్యూ ఇన్ఫో సెంటర్, పీడబ్ల్యూ బ్యాచ్‌ల అడ్మిషన్లు, ఆర్థిక సహాయం, రిజిస్ట్రేషన్ గురించి సమాచారం కోసం వన్-స్టాప్ గమ్యస్థానంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# త్రైపాక్షిక ఒప్పందానికి తిలోదకాలు

- ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ

విశాలాంధ్ర - ఉయ్యూరు : విద్యుత్ బోర్డ్ విభజనకు ముందు చేసుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి కంపెనీలు తిలోదకాలు ఇచ్చాయని విద్యుత్ ఎం ప్లా యిస్ యూనియన్ నాయకులు ఆరోపించారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీగా ఏర్పడి దీర్ఘకాలిక సమస్యల సాధ నకై దశలవారీ ఆందోళన కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ, ఏడిఈ ఆఫీసుల వద్ద సోమ వారం ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియచేసారు. ఈ కార్యక్రమంలో 327 యూనియన్, పాటు 1104 ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ ఎం. మోహన్రావు, ఇతర యూనియన్ నాయకులు జి.నాగరాజు, సుబ్రహ్మణ్యం , శ్రీనివాస రావు, సురేష్, కాంట్రాక్ట్ కార్మికుల రీజనల్ ప్రెసిడెంట్ పామర్తి .శ్రీ ఆంజనేయులు, ఉయ్యూరు డివిజన్ ప్రెసి డెంట్ సురేష్, కార్యదర్శి నాగేశ్వరావు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత నాలుగైదేళ్ళుగా విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదని, కార్మిక సంఘాలు గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజ నాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారని, డిస్ట్రిబ్యూషన్ కంపెనీల యాజమాన్యం కార్మిక చట్టా లకు, విద్యుత్ బోర్డ్ విభజనకు ముందు ఉద్యోగ సంఘా లతో కుదుర్చుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి విరుద్ధంగా గత ఆరు దశాబ్దాల నుండి అమలులో వున్న సర్వీస్ నిబంధనలను ఏకపక్షంగా మార్పులు చేస్తున్నారని, త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం బోర్డు విభజనకు ముందు అమలులో వున్న సర్వీస్ నిబంధనలు, పని ప్రమా ణాలు, కారుణ్య నియామకాలు తదితర ప్రయోజనాలు యధావిధిగా కొనసాగుతాయని, ఏవైనా మార్పులు చేయాలంటే ఉద్యోగ సంఘాలతో చర్చించి ప్రస్తుత ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా పరస్పర అవ గాహనతో ఒప్పందాలు చేయబడతాయని పేర్కొ నడం జరిగిందని తెలిపారు. జీతభత్యాల విషయంలో ప్రస్తు తం అమలులో ఉన్న పరస్పర చర్చల ద్వారా వేతనాలు నిర్ణయించే పద్ధతి ఇకముందు ఏర్పడబోయే సంస్థలలో కూడా కొనసాగించ బడుతుందని త్రైపాక్షిక ఒప్పందం లో స్పష్టంగా పేర్కొన్నప్పటికి అందుకు భిన్నంగా 2022 వేతన సవరణపై నిర్ణయాలు మునుపెన్నడూ లేని విధంగా ఒక మాజీ ఐఏఎస్ అధికారిని నియమించా రని, పూర్వం నుండి అమలులో ఉన్న వెయిటేజ్ ఫార్ము లాను రద్దుచేసి, అతి తక్కువ శాతం (8%) ఫిట్మెంట్ బెనిఫిట్స్ను, పాత పద్ధతికి విరుద్ధంగా ఇంక్రిమెంట్లు, మాస్టర్ స్కేలు రూపొందించారని,. ఈ పద్ధతి వల్ల ఉద్యో గులు చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాలు దిగిరాకుంటే దశలవారీ ఆందోళన చేపట్టనున్నట్లు, అందులో భాగంగా ఈనెల16న అన్ని సర్కిల్ ఆఫీసులు మరియు జనరే టింగ్ స్టేషన్ల ముందు నిరసన తెలియజేయుట,17న భోజన విరామ సమ యంలో ధర్నా నిర్వహించి సమస్యలపై చర్చించ టం,18న అన్ని సర్కిల్ ఆఫీసుల, జనరేటింగ్ స్టేషన్ల ముందు రిలే నిరాహార దీక్షలు, 20న అన్ని జిల్లా కేంద్రాలలో శాంతియుత ర్యాలీ ద్వారా కలెక్టర్లకు వినతి పత్రం సమర్పణ, 22న అప్పటికి సమస్యలు పరిష్కారం కాని ఎడల తదుపరి కార్యాచరణ నిర్ణయించబడు తుందని యూనియన్ నాయకులు తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శి నుంచి ఉపాధ్యాయుడిగా

విశాలాంధ్ర-ఎ కొండూరు : తిరువూరు మండలం మునుకుళ్ళ గ్రామానికి చెందిన అవులూరి కృష్ణా రెడ్డి సాధారణ వ్యవసాయం కుటుంబంలో జన్మించి ఎన్నో అటు పాట్లను ఎదుర్కొని గత వైసిపి ప్రభుత్వ హయంలో 2019లో విడుదల చేసిన సచివాలయ నోటిఫికేషన్లో ఉద్యోగం సంపాదించి వివిధ గ్రామ పంచాయతీలలో సచివాలయ కార్యదర్శిగా విధు లను నిర్వహించి మంచి పేరు తెచ్చుకొన్నారు. ఇటీవల జరిగిన రెగ్యులర్ ట్రాన్స ఫర్లో భాగంగా ఎ కొండూరు మండలం రామచంద్రపురం గ్రామ సచివాలయ కార్యదర్శిగా కొనసగుతూ 2025లో కూటమి ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫి కేషన్లో తన ఉపాధ్యాయుడుగా పనిచేయాలి అనే కలను నిజం చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా కల్పించడంతో డీఎస్సీ పరీక్షను రాసిన కృష్ణా రెడ్డి జిల్లాలో 402 వ ర్యాంకును సంపాదించి ఉపాధ్యా ఉద్యోగం పొందడం తో ఆయనకు మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గద్దె కృష్ణా రెడ్డి ఎ కొండూరు మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు భూరోతు పీక్లా నాయక్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేముల కొండ సాంబశివరావు గోగిలమూడి రామ్ ప్రసాద్ రెడ్డి తో వైసీపీ నాయకులు జడ్పీటీసీ భూక్యా గానీయా, రాష్ట్ర నాయకులు ఎన్.వీరరెడ్డి , కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ ఆయను అభి నందించి రానున్న రోజుల్లో ఉపాధ్య వృత్తిలో ఉన్నత మైన స్థనలకు వెళ్ళి మంచి పేరు ప్రతిష్ఠలు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - దుర్గి : శ్రీ సత్యసాయి సేవ సంస్థ దుర్గి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్యూటీ ఈజ్ గాడ్ అనే అంశముపై వ్యాచరచన పోటీలు నిర్వహించారు. 20 మంది 8, 9, 10 తరగతుల విద్యార్థులు వ్యాచరచన పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు పలుచూరి సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు అనంతరామయ్య, కొంగర క్రిష్ణయ్య పర్యవేక్షించారు.

# సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర-రెంటచింతల : విద్యుత్ రంగ సంస్థలలో దీర్ఘకా లిక సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా జేఏసీ చైర్మన్ ఎం.వీరాంజ నేయులు, జిల్లా కన్వీనర్ కె.విజ యకృష్ణ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 15 నుంచి దశలవారీగా ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమ వారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్లో సెక్షన్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిర సన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగదు రహిత వైద్యం అందించాలని, 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగష్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులు (కార్మికులు) సంబంధించిన 6 డిమాండ్లతో పాటు మొత్తం 13 రకాల డిమాం డ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ ఆందోళన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. 15, 16 తేదీలలో నల్లబ్యాడ్జీలను ధరించి విధులు నిర్వహించడం, 17, 18 తేదీలలో భోజన విరామ సమయాలలో ఆందోళనలు చేపట్టడం, 19, 20 తేదీలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టి 22వ తేదిన ఉద్యోగులంతా భారీ ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్కు మెమోరాండం సమర్పించే విధంగా ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎస్.శ్రీనివాసచారి, ఎస్. వెంకటేశ్వర్లు, టి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, వి.సుదర్శన్ పాల్గొన్నారు.

# తాడేపల్లి హైవేపై ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి హైవేపై వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. హైవేకి మధ్య లో ఉన్న పోలీసు పోస్టుకు ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బైరి వెంకన్న(45) స్వస్థలం శ్రీకాకుళం జిల్లా అని ప్రస్తు తం విజయవాడలో బాపట్ల వీధిలో పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడని మృ తుడు మద్యానికి బానిసై అప్పుల భారాన్ని తట్టుకోలేక ప్రతి రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లి మద్యం సేవించేవాడని సోమవారం తాడే పల్లి బైపాస్ రోడ్డు హైవేలో పోలీస్ పోస్ట్కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడని పోలీసులు తెలి పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి : జేసీ శ్రీవాత్సవ

విశాలాంధ్ర - గుంటూరు సిటీ: భారీ వర్షాలు కురిసేటపుడు పూర్తి అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అధికారు లను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా వర్షాలు పట్ల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0863 223 4014 ఫోన్ నంబరుతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరూ ఉండరాదని ఆయన ఆదేశించారు.

# విప్రో నుంచి మాక్స్‌క్లీన్ 2-ఇన్-1 ఫ్లోర్ క్లీనర్

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్ ): విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ హౌస్కు చెందిన ప్రముఖ బ్రాండ్ మాక్స్‌క్లీన్ ఫ్లోర్ క్లీనర్, తన తాజా ఆవిష్కరణగా మాక్స్‌క్లీన్ 2-ఇన్-1 ఫ్లోర్ క్లీనర్‌ను విడుదల చేసింది. ఇది శాస్త్రీ యంగా రూపొందించబడిన క్రిమిసంహారకం. ఇది సాధారణ ఫ్లోర్ క్లీనర్‌లా గచ్చును క్రిమిరహితం చేసి కఠినమైన ధూళి, దుమ్మును తొలగించడమే కాకుండా కీటకాలను కూడా అడ్డుకుంటుంది. ఆకర్షణీయమైన టీవీసీ క్యాంపె యిన్ ద్వారా విడుదలను ప్రకటించిన ఈ ఉత్పత్తి భారతీయుల నివాసాల కోసమే ప్రత్యేకంగా తయారైంది. శుభ్రత, పరిశుభ్రతను ఒకే అనుకూలమైన దశలో కలపడం ద్వారా రోజువారీ గృహ సంరక్షణకు తెలివైన, మరింత సమగ్రమైన విధానాన్ని అందిస్తుంది. మాక్స్‌క్లీన్ తన ప్రత్యేక సహజ నూనెల మిశ్రమంతో సాంప్రదాయంగా శుభ్రపరచడమే కాకుండా, చీమలు, ఈగలు వంటి కీటకాలను కూడా సమర్థవంతంగా తిప్పికొడుతుంది. మాక్స్‌క్లీన్ డ్యూయల్-యాక్షన్ ఫార్ములాతో, వినియోగదారులు ప్రామాణిక సూక్ష్మక్రిమి రక్షణ ప్రయోజనాన్ని పొందుతారు. మాక్స్‌క్లీన్ 2-ఇన్-1 ఫ్లోర్ క్లీనర్ అన్ని ప్రధాన రిటైల్ దుకాణాలు, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో వివిధ ప్యాక్ పరిమాణాలలో అందుబాటులో ఉందని విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ బిజినెస్ డెవలప్‌మెంట్ జీఎం ఉషాసిన్ సాహ తెలిపారు.

# చింతలపూడిలో జాతీయ మీడియా ప్రతినిధులు పర్యటన

విశాలాంధ్ర - దుగ్గిరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమిత్వ పథకం అమలు పనితీరు పరిశీలనకై జాతీయ మీడియా ప్రతినిధులు రాష్ట్ర పంచా యతీరాజ్ శాఖ ఉన్నత అధికారులు సోమవారం చింతలపూడి గ్రామాన్ని సందర్శించారు.గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాలు అమలు గురించి తెలుసుకున్నారు. అనంతరం ప్రియదర్శి ఇంజనీరింగ్ కాలేజీలోని ఆడిటో రియంలో గ్రామ సభను నిర్వహించారు. సభకు గ్రామ సర్పంచ్ తాడి బోయిన రామకృష్ణ అధ్యక్షత వహించారు.పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న పథకాలు వాటి అమలు పనితీరు గురించి మీడియా ప్రతినిధులకు వివరించారు.సభలో సమిత్వా రాష్ట్ర డైరెక్టర్ ఏ.నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ సమిత్వా పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పనితీరుపై జాతీయ మీడియా ప్రతినిధులకు వివరించామన్నారు.రెండో విడత ఫిబ్రవరిలో లబ్ధిదారులను కలిసి పథకం గురించి తెలుసుకుంటామన్నారు.మార్చి అనంతరం మూడో విడతలు పూర్తి చేస్తామన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మహేష్ కుమార్, పంచా యతీరాజ్ ఏడి చందన, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, డిఎల్పిఓ స్వరూప రాణి,ఎంపీడీవో వి.చంద్రమోహన్, డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ, పంచాయతీ కార్యదర్శి మణికంఠ, వివేకానంద,16 మంది మీడియా ప్రతినిధులు,పంచాయతీరాజ్ అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# కుక్క కాటుకు గురైన చిన్నారి మృతి

విశాలాంధ్ర - పొన్నూరు : ఇటీవల కుక్క కాటుకు గురైన పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామానికి చెందిన తాడిశెట్టి కార్తీక్(5) చికిత్స పొం దుతూ సోమవారం మృతి చెందాడు. గత నెల 22వ తేదీన ఇంటి వద్ద ఆడు కుంటున్న చిన్నారి తాడిశెట్టి కార్తీక్‌పై వీధి కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయాల పాలైన కార్తీక్‌ను అతని తండ్రి తాడిశెట్టి రాజా హుటాహుటిన నిడు బ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికు తరలించినప్పటికీ పరిస్థితి విషమించటంతో విజయవాడ రెయిన్‌బో హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తీసుకునివెళ్లారు. కార్తీక్ రాబిస్ వ్యాధిన పడి సోమవారం మృత్యువాత పడ్డాడు. దీంతో వెల్లలూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎందరో చిన్నారుల ప్రాణాలు హరిస్తున్న వీధి కుక్కలను నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తిని తెలుపుతున్నారు. సుప్రీంకోర్టు కుక్కల నిర్మూ లనకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ప్రభుత్వ చర్యలు మాత్రం నామమాత్రం గానే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి వీధి కుక్కల నిర్మూలనకు నడుంబిగించాలని ప్రజలు కోరుతున్నారు.

# చెత్త వ్యర్థాలను వేరు చేసే విధానంపై శిక్షణ

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలో గల సుప్రీమ్ ఎల్‌టీసీ సెంటర్‌లో మొదటి రోజు ప్రత్తిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్, ఫిరంగిపురం, తాడికొండ మండలాలలో ఇటీవల సెలెక్ట్ కాబడిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కి చెత్త వ్యర్థాలను వేరు చేసే విధానం గురించి శిక్షణ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ చల్లా నాగ మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు ఎంపీడీఓ కె.శివపార్వతి హాజరయ్యారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు శానిటేషన్ ప్రక్రియ పట్ల, చెత్త వ్యర్థాలను వేరు చేసి ఇచ్చేలా ప్రజలకు అవ గాహన కల్పించడం కోసం ప్రభుత్వం మిమ్మల్ని నియమించడం జరిగిందని ఎంపీడీఓ శివపార్వతి తెలిపారు. సీఆర్‌పీలు రోజులో కనీసం 2 లేదా 3 గంటలు ఉదయం లేదా సాయంత్రం స్వయం సహాయక సంఘాల మహిళలకు, ప్రజలకు డోర్ టూ డోర్ చెత్త వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ రిసోర్స్ కోఆర్డినేటర్ అనురాధ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, ఐటీసీ, ఫినిష్ సొసైటీ కో ఆర్డినేటర్ ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.